తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 201 | గురువారం 12–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in

# రేవంత్ .. చేతకాని ముఖ్యమంత్రి

- అందుకే సంక్షోభంలో రాష్ట్రం .. ప్రతి వర్గం గోస పడుతోంది
- ఢిల్లీకి అందే మూటలపై తప్ప.. మీరిచ్చిన మాటపై శ్రద్ధ లేదా ?
- తెలంగాణ బతుకు ఛిద్రం అవుతుంటే ప్రేక్షకపాత్ర వహిస్తారా ?
- నమ్మి అధికారమిస్తే ఆగం చేయడమే కాక.. అస్థిత్వాన్ని దెబ్బతీస్తారా ?
- గ్యారెంటీలకు దిక్కులేదు, 420 హామీలకు పత్తాలేదు, డిక్లరేషన్లకు అడ్రస్ లేదు !
- అన్నదాతల నుంచి ఆడబిడ్డల వరకూ అందరూ బాధితులే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ



**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**


గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారు...
సరిగ్గా ఏడాది క్రితం కొలువుదీరిన మీ కాంగ్రెస్ సర్కారు తెలంగాణను ఆగం చేయడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోంది. చేతకాని, మతిలేని ముఖ్యమంత్రిని తెలంగాణ నెత్తిన రుద్ది మీరు చేతులు దులుపుకోవడంతో అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోంది. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం దాకా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఎన్నికల టైంలో మీరు ఊరురా తిరిగి ఊదరగొట్టిన గ్యారెంటీలన్నీ గారడీలేనని మీ ఏడాది పాలన చూస్తే అర్థమైపోయింది. మీరు చేసిన డిక్లరేషన్ల పట్ల మీకే డెడికేషన్ లేదని అక్షరాలా రుజువైపోయింది. మేనిఫెస్టోలో మీరిచ్చిన 420 హామీలు.. కాంగ్రెస్ చీటింగ్ చాప్టర్ లో భాగమేనని తెలంగాణ సమాజానికి తెలిసిపోయింది. గాలి మోటర్లో వచ్చి గాలిమాటలు చెప్పి ఏడాదిపాటు పత్తా లేకుండా పోయిన మీకు, మీ పార్టీకి తెలంగాణ పట్ల రవ్వంత కూడా బాధ్యత లేదని తేలిపోయింది. ప్రగతిపథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కనీసం కన్నెత్తి చూడని మీ తీరును చూసి నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై మీకున్న శ్రద్ధ, మీరు ప్రజలకు మీరిచ్చిన మాటపై లేకపోవడం నయవంచన, ద్రోహం కాక మరేంటి.ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం మీ నైజం.. అవినీతి మీ ఎజెండా, నియంతృత్వం మీ విధానమని అడుగడుగునా తేల్చిచెప్పారు. మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం చేతిలో తెలంగాణ బతుకుచిత్రం ఛిద్రమవుతుంటే మీరు ప్రేక్షకపాత్రకే పరిమితమైన వ్యవహారంపై ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. దేశానికే వెన్నుముక అయిన రైతన్నకు వెన్నుపోటు పొడిచిన దుర్మార్గపు పాలన మీది. కాంగ్రెస్ కు అధికారమిస్తే ఏకకాలంలో రైతులందరికీ డిసెంబర్ 9న 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట నీటిమూటే అయ్యింది. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా నాలుగు విడతలుగా ఊరించి ఊరించి ఉసూరుమనిపించడంతో.. ఇప్పటికే దాదాపు 620 మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్నారు.

మిగతా 2లో

# కేటీఆర్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఫైర్..

- కేటీఆర్ పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మండిపాటు
- ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి ఉన్నాం
- బీఆర్ఎస్ తనకు మద్దతు ఇచ్చి స్పీకర్ పదవిలోకి రావడానికి తోడ్పడింది : స్పీకర్ గడ్డం ప్రసాద్

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, తాను ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తనకు మద్దతు ఇచ్చి స్పీకర్ పదవిలోకి రావడానికి తోడ్పడిందని గుర్తుచేశారు, కానీ బీఆర్ఎస్ నేత కేటీఆర్ తనపై వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. ఇంకా బీఆర్ఎస్ తన విధానాన్ని మార్చుకోలేదని, ప్రజల్లో విశ్వాసం కోల్పోతోందని విమర్శించారు.
హైదరాబాద్ ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో, సభా వ్యవహారాలపై సభ్యుల అవగాహన పెంపుదల లక్ష్యంగా సభ ప్రారంభోత్సవాన్ని ప్రసాద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మరియు ఇతరులు నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ, శాసనసభలో సభ్యులు చట్టాల రూపకల్పనతో పాటు వాటి అమలు తీరు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై చర్చించాలన్నారు. సభ సమావేశాలు ఎక్కువ రోజులు జరగాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.గత శాసనసభ సమావేశాల్లో సీనియర్ సభ్యుల ప్రసంగాలు నూతన సభ్యులకు స్ఫూర్తిగా ఉండేవని పేర్కొన్నారు. వాగ్ధాటితోపాటు సభా నిబంధనలపై అవగాహన ఉన్న సభ్యులు సభా నిర్వహణకు సహకరిస్తారని అభిప్రాయపడ్డారు. జీరో అవర్, ప్రశ్నావేళ, బడ్జెట్ ఆమోదం వంటి అంశాలపై సభ్యుల అవగాహనను పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు శాసనసభ సభ్యుల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కీలకమని స్పీకర్ అభిప్రాయపడ్డారు.


# చెరువు స్థలంలో రోడ్డు వేస్తే తొలగించాలి..

- హైడ్రా కమిషనర్ ఆదేశం
- రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జాపై హైడ్రా సర్వే
- స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారని ఆరోపణ
- పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిపై ఆగ్రహం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జాపై హైడ్రా సర్వే చేస్తున్న స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారని ఆరోపణతో నిన్నటి నుండి హైడ్రా అధికారులు సర్వే చేస్తున్నారు. మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేయడంపై పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిపై ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో కమిషనర్‌పై యాక్షన్ తీసుకునే అవకాశం ఉంది. చెరువు భూమిలో ఎలా రోడ్డుకు నిధులు కేటాయిస్తారని రంగనాథ్ ప్రశ్నించారు. సర్వే త్వరగా పూర్తి చేసి చెరువు, పట్టా భూమి బార్డర్ లో రోడ్డు ఫిక్స్ చేయాలని హైడ్రా సిబ్బందికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. చెరువు స్థలంలో రోడ్డు వేస్తే తొలగించాలని హైడ్రా సిబ్బందికి ఆదేశించారు ఏవీ రంగనాథ్.




# అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేదు

- ట్విటర్ (ఎక్స్) ద్వారా తెలిపిన అరవింద్ కేజీవాల్
- ఇండియా కూటమిలో ఉన్నా పొత్తు ఉండదు
- విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి బీజేపీ మాట్లాడాలి

మిగతా 2లో

# రేవంత్ రెడ్డి ఏ రోజు జై తెలంగాణ అనలేదు...

- డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చిందంటే కారణం కేసీఆర్
- కానీ ఎవరో దయతో వచ్చిందని సీఎం చెబుతుంటే ఇది తెలంగాణ ఉద్యమం, అమరులను అవమాన పరచడమే
- తెలంగాణకి నంబర్ వన్ విలనే కాంగ్రెస్ పార్టీ : హరీష్ రావు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి చరిత్రలో ఏ రోజు జై తెలంగాణ అనలేదు...ఉద్యమంలో పాల్గొనలేదన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చిందంటే కారణం కేసీఆర్ అని, కానీ ఎవరో దయతో వచ్చిందని సీఎం చెబుతుంటే ఇది తెలంగాణ ఉద్యమం, అమరులను అవమాన పరచడమే అని ఆయన మండిపడ్డారు. తెలంగాణకి నంబర్ వన్ విలనే కాంగ్రెస్ పార్టీ అని ఆయన విమర్శించారు. 2001 లో కేసీఆర్ పార్టీ పెట్టకపోతే తెలంగాణ అనే మాటే లేదు కదా అని, తెలంగాణ అనే పదం అసెంబ్లీలో ఆనాడు నిషేధించారని, 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 16 ఏళ్ల టీడీపీ పాలనలో తెలంగాణ అనే పదం లేకుండా చేశారన్నారు హరీష్ రావు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉండి ఢిల్లీలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణకు అనుకూలంగా లేఖలు తెప్పించారని, 2004 నుంచి 2009 వరకు మాతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని ఆయన వ్యాఖ్యానించారు.అంతేకాకుండా..'నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన లేకపోతే జూన్ 2 లేదు. ఆనాడు రేవంత్ రెడ్డిని తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే రాజీనామా చేయలేదు. చంద్రబాబుని రాజీనామా చేయమంటే తుపాకీ పట్టుకుని వచ్చాడు రేవంత్ రెడ్డి. చిదంబరం నుంచి

మిగతా 2లో

# 2035 కల్లా భారత్ సొంత అంతరిక్ష కేంద్రం

- సైన్స్ అండ్ టెక్నాలజీ అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్
- గగన్ యాన్ విషయాలు వెల్లడించిన కేంద్రమంత్రి
- 2040 నాటికి చంద్రుడిపై కాలు మోపుతామని వెల్లడి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



భారతదేశం 2035 కల్లా తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని సిద్ధం చేయనుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపే ఆవకాశం ఉందని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష మంత్రిత్వశాఖలు ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రునిపై భారతీయ వ్యోమగామిని దింపాలనే ప్రణాళికలతో అంతరిక్ష పరిశోధనలో ప్రధాన మైలురాళ్లనుసాధించడానికి సిద్ధంగా ఉంది. 2035 నాటికి భారత్ సొంత స్పేస్ స్టేషన ను ఏర్పాటు చేసుకుంటుంది. అంతరిక్ష కేంద్రాలు కలిగి ఉన్న అమెరికా వంటి దేశాల సరసన త్వరలో భారత్ నిలవనుంది

మిగతా 2లో

# తెలంగాణలో ఐదేళ్లలో 1,03496 మంది అదృశ్యం

- ఇంకా దొరకని 6,468 మంది ఆచూకీ
- 2014 నుంచి 2019 వరకు ఇదే కథ..
- 2020–2024 మధ్య అత్యధికం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

అదృశ్యమైన వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఎక్కువని అప్పట్లో పిటిషన్.. ప్రభుత్వానికి హైకోర్టు మందలింపుతెలంగాణ రాష్ట్రంలో 'అదృశ్యం' కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వయోభేదాలు లేకుండా ఇంటినుంచి బయటికి వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకుండా తప్పిపోతుండటం కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో కొందరు, ఇంట్లో పెద్దలు మందలించారని ఇంకొందరు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మరికొందరు కనిపించకుండా పోతున్నారు. ఇలా తప్పిపోతున్న వారి కుటుంబసభ్యులు సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేక.. చివరకు పోలీసుస్టేషన్లలో 'మిస్సింగ్'కేసులు నమోదు చేస్తున్నారు. ఫిర్యాదు చేసి కళ్లు కాయలు కాయేలా ఎదురు చూసిన కొందరికి తమ కుటుంబసభ్యుల ఆచూకీ దొరకగా.. మరికొందరికీ ఎదురుచూపులే మిగిలాయి. తప్పిపోయిన వారిలో కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరి కొంతమంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు.

**అదృశ్యం కేసులపై హైకోర్టు తీవ్ర స్పందన**

అప్పట్లో రాష్ట్రంలో పెరిగిన మిస్సింగ్ కేసులపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం.. ఏటా తొమ్మిది వరకు మిస్సింగ్ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. 2019 నుంచి 2020 నవంబర్ వరకు ఆ కేసులు రెట్టింపు అయ్యాయని హైకోర్టులో ఓ ప్రైవేట్ పిటిషన్ కూడా దాఖలైంది. అదృశ్యమైన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా ఉన్నట్టు కేసులు నమోదయ్యాయని పిటిషనర్ వివరించారు.
దీనిపై ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో షీ టీమ్, దర్పన్ యాప్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, ఆపరేషన్ ముస్కాన్ లాంటి కార్యక్రమాల ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఆ తర్వాత కూడా 2020 నుంచి 2024 అక్టోబర్ 19 వరకు రాష్ట్రంలో 1,03,496 మంది బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీలు తప్పిపోయినట్లు కేసులు నమోదయ్యాయి. 2023లో అత్యధికంగా 23,509 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది డిసెంబర్ 19 నాటికి 20,403 కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైన 1,03,496 మందిలో 97,028 మంది ఆచూకీ లభించగా, ఇంకా 6,468 మంది ఎక్కడ ఉన్నారో, ఏమైపోయారో తెలియని పరిస్థితి నెలకొంది.

**'అదృశ్యం'కేసుల్లో మహిళలే ఎక్కువ..**

తెలంగాణవ్యాప్తంగా

మిగతా 2లో



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం 12 –12–2024


## ఐపీసీ సెక్షన్ 498ఏ
# చట్టంతో కక్ష సాధింపు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



అత్తవారింట్లో భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించడం కోసం ఉద్దేశించిన చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్నారని సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. భర్తపై, అతని కుటుంబంపై వ్యక్తిగత కక్ష సాధించడం కోసం 498 ఏ సెక్షన్ కింద తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడింది. పోలీసులు, యంత్రాంగం ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, వ్యక్తిగత కక్ష సాధింపులకు అవకాశం ఇవ్వకూడదని పేర్కొంది. ఈమేరకు తెలంగాణకు సంబంధించిన ఓ కేసు విచారణలో భారత అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.
తెలంగాణ హైకోర్టును తప్పుపట్టిన సుప్రీం ధర్మాసనం.. వివాహాన్ని రద్దు చేయాలని తాను కోర్టుకెక్కితే భార్య తనపై వేధింపుల కేసు పెట్టిందని, తప్పుడు ఉద్దేశంతో కక్ష సాధింపు కోసం పెట్టిన ఈ కేసును కొట్టేయాలని తెలంగాణకు చెందిన ఒకరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ హైకోర్టు తన పిటిషన్ ను కొట్టేయడంతో సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం.. తెలంగాణ హైకోర్టు తీరును తప్పుబట్టింది. వ్యక్తిగత కక్ష సాధింపు కోసమే ఈ కేసు పెట్టారని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ కేసు కొట్టేయడాన్ని, నిరాకరించడం తప్పిదమని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిర్ధారణ అయితే మూడేండ్ల జైలు..ఐపీసీ సెక్షన్ 498 ఏ లేదా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని సెక్షన్ 86ను భర్త తరపువాళ్లపై కక్ష సాధించేందుకు భార్య ఓ ఆయుధంగా మార్చుకుంటోందని సుప్రీం కోర్టు ద్విసభ ధర్మాసనం విమర్శించింది. దేశవ్యాప్తంగా ఇలాంటి కేసులు పెరుగుతుండడంపై సుప్రీం బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. నిరాధార ఆరోపణలతో అమాయకులను కేసుల్లోఇరికిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా చేసే ఇలాంటి ఫిర్యాదుల ఆధారంగా భర్తను, భర్త కుటుంబ సభ్యులను ప్రాసిక్యూట్ చేయడం తగదని, ఈ తరహా ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసు యంత్రాంగానికి సుప్రీంకోర్టు సూచించింది.ఐపీసీ సెక్షన్ 498 ఏ.. నాన్బెయిలబుల్ కేసు..
భర్త, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన సందర్భాల్లో భార్యకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించినదే ఐపీసీ సెక్షన్ 498 ఏ.. లేదా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని సెక్షన్ 86.. ఈ సెక్షన్ ప్రకారం.. వరకట్నం కోసం, అదనపు కట్నం కోసం లేదా మరేదైనా కారణంతో ఆడాళ్లపై భర్త, అతని కుటుంబ సభ్యులు శారీరక, మానసిక వేధింపులకు పాల్పడితే ఐపీసీ 498 ఏ, బీఎన్ఎస్ 86 ప్రకారం కేసు నమోదు చేయవచ్చు. ఈ కేసుల్లో దోషిగా తేలితే భర్త, అతని కుటుంబ సభ్యులకు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ సెక్షన్ కింద నమోదు చేసిన కేసుల్లో బెయిల్ పొందే వీలులేదు. ఇది నాన్ బెయిలబుల్ కేసు. అందుకోసమనే ఎక్కువ మంది మహిళలు భర్తతోపాటు అతని కుటుంబ సభ్యులను ఇరికించే యత్నంలో ఇలాంటి కేసులను ఎక్కువగా ఎంచుకుంటున్నట్టు సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

## ఇందిరమ్మ ఇళ్లకు 80 లక్షల దరఖాస్తులు..

- **మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు**


**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన, గ్రూప్2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీల పెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం ఆయన సచివాలయలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31వతేదీ లోగా పూర్తిచేయాలి. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి. ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగిని (సర్వేయర్) నియమించుకోవాలి. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలి. రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాకపోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలి. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు చేయాలి. అంతేగాక స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్‌లు ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలి. సర్వే వివరాలపై ప్రతి రోజూ కలెక్టర్‌లు సమీక్షించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాలకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియ. ఈ ఏడాది 4.5 లక్షల ఇళ్లను నిర్మించబోతున్నామని" కలెక్టర్లకు మంత్రి సూచించారు.

# రేవతి చావుకు బన్నీనే కారణం..!

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సంధ్య థియేటర్ యాజమాన్యం చెప్పిన ఓ చిన్న విషయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. రేవతి మృతికి కారణం అల్లు అర్జున్ అన్న చర్చ జరుగుతోంది. ఈనెల 5వ తేదీన పుష్ప 2 ప్రీమియర్ షోకు టికెట్లు కొనుక్కొని వెళ్లిన రేవతి అనే మహిళ తొక్కిసలాటలో మృతిచెందగా ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై రేవతి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ యాజమాన్యం, సినీహీరో అల్లు అర్జున్ సహా పలువురిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టివేయాలని బుధవారం నాడు సంధ్య థియేటర్ యజమానులు కోర్టును ఆశ్రయించారు. పుష్ప 2 ప్రీమియర్ షోలో రేవతి అనే మహిళ మృతికి, తమకు ఎలాంటి సంబంధం లేదని సంధ్య థియేటర్ యజమానులు తెలిపారు. అందువల్ల తమపై పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ యజమానురాలు రేణుకాదేవి, ఇతరులతో పాటు సంధ్య సినీ ఎంటర్‌ప్రైజ్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ తొక్కిసలాట జరగడానికి తాము కారణం కాదని.. థియేటర్ తమదే అయినప్పటికీ.. ప్రీమియర్ షో నిర్వహణకు, బన్నీ రాకకు తమకు సంబంధం లేదని తేల్చేసింది.
ఆ షోను డిస్ట్రిబ్యూటర్లు నిర్వహించారని, ప్రీమియర్ షో, బెనిఫిట్ షోలకు అనుమతిస్తూ ప్రభుత్వం మెమో సైతం జారీ చేసిందని తెలిపారు. థియేటర్ మైత్రీ డిస్ట్రిబ్యూటర్ ఆధీనంలో ఉందని తెలిపారు. అయినప్పటికీ తమ బాధ్యతగా తాము బందోబస్తు కల్పించాలని, జనాలను అదుపు చేయాలని పోలీసులకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. కొంతమంది పోలీసులు బందోబస్తుకు వచ్చినప్పటికీ విపరీతమైన తోపులాట వల్ల ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో తమకు ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి చేశారంటూ వంటి తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. సినీ హీరో సెక్యూరిటీ సిబ్బంది వల్ల ఘటన జరిగినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారే తప్ప తమపై ఎలాంటి ఆరోపణ లేదని తెలిపారు. అందువల్ల కేసు కొట్టేయాలని కోరారు.

# రేవంత్ .. చేతకాని ముఖ్యమంత్రి

మొదటి పేజీ తరువాయి

అయినప్పటికీ ముఖ్యమంత్రిలో చలనం లేదు.. కాంగ్రెస్ సర్కారులో కనీస మానవత్వం లేదు.
బీఆర్ఎస్ హయాంలో అప్రతిహతంగా కొనసాగిన పెట్టుబడి సాయానికి కాంగ్రెస్ రాగానే బ్రేకులు వేశారు. బీఆర్ఎస్ సిద్ధం చేసిన రైతుబంధు నిధులను ఒకసారి విడుదల చేశారే తప్ప..ఏడాదైనా మీరు చెప్పిన రైతుభరోసాను అసలు మొదలే పెట్టలేదు. వానాకాలం సీజన్ లో పెట్టుబడి సాయాన్ని మొత్తానికే ఎగ్గొట్టి రైతాంగాన్ని నిలువునా ముంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద 15 వేలు, రైతు కూలీలకు 12 వేల చొప్పున ఇస్తామన్న హామీకి ఏడాదైనా అతీ గతీ లేదు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని నమ్మబలికి, తీరా గద్దెనెక్కాక సన్న వడ్లకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కిన మీ సన్నాసి ప్రభుత్వ నిజస్వరూపాన్ని రైతులు అర్థం చేసుకున్నారు. కాంగ్రెస్ ను నమ్మితే రైతుకు గోస తప్ప భరోసా లేదని తొలి ఏడాది పాలనలోనే తేల్చి చెప్పారు. బోనస్ మాట దేవుడెరుగు కనీసం పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక "సాగు" మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. విత్తనాలు, ఎరువుల కోసం మళ్లీ క్యూలైన్లో చెప్పులు, పాసు పుస్తకాలు పెట్టే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ సర్కారును చూసి అన్నదాతలు అసహ్యించుకుంటున్నారు.
అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ వేసి.. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మీరిచ్చిన హామీ గంగలో కలిసిపోయింది. ఈ ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 12,527 మాత్రమే. అంటే తెలంగాణ యువతకు మీ కాంగ్రెస్ ప్రభుత్వం అక్షరాలా 1,87,473 ఉద్యోగాలు బాకీ ఉందనే విషయాన్ని తెలంగాణ యువత మరిచిపోలేదు. యువతకు ఇస్తామన్న 10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయని తెలంగాణ సమాజం మిమ్మల్ని సూటిగా ప్రశ్నిస్తోంది. ఇక అశోక్ నగర్ లో నిరుద్యోగులతో ఫోటోలకు ఫోజులుకొట్టి అడ్రస్ లేకుండా పోయిన మీరు కూడా కాంగ్రెస్ చేసిన మోసంలో భాగస్వాములేనని యువత బలంగా నమ్ముతోంది.
ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డలకు అరచేతిలో వైకుంఠం చూపించి నిలువునా మోసం చేశారు. అరకొరగా నడిచిన ఫ్రీ బస్సు స్కీమ్ తప్ప మహిళలకు ఒరిగిన ప్రయోజనం ఒక్కటీ లేదు. 18 ఏళ్లు నిండిన





ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ .2500 హామీకి 365 రోజులు గడిచినా మోక్షం లేదు. నయా పైసా ఇచ్చే దిక్కులేదు కానీ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మీ ఢిల్లీ పార్టీ చేసిన ప్రకటనలోని డొల్లతనాన్ని తెలంగాణ ఆడబిడ్డలు పసిగట్టేశారు. కళ్యాణలక్ష్మి పథకానికి తోడు తులం బంగారం ఇస్తామని మభ్యపెట్టి.. చివరికి అసలు పథకానికి కూడా ఎసరు పెట్టిన దగుల్బాజీ పాలన మీది. ఏడాది కాలంగా కళ్యాణలక్ష్మి సాయం అందని పేద తల్లిదండ్రులు కాంగ్రెస్ కు శాపనార్థాలు పెడుతున్నారు.
వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లను 4 వేలకు పెంచుతామని, దివ్యాంగుల పించన్ ను 6 వేలు చేస్తామని ఇచ్చిన హామీ ఏడాదైనా అమలు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ దగాకోరు విధానాలకు నిదర్శనం. ఇచ్చే పించన్లలో కూడా రెండు నెలలు ఎగ్గొట్టి నిరుపేదల నోటికాడి బుక్కను లాగేసుకున్న కాంగ్రెస్ సర్కారుకు వారి పాపం తగలక మానదు.
హైడ్రా పేరిట హంగామా సృష్టించి నిరుపేదలకు నిలువ లేకుండా చేసిన పాపం మీ కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట మీ లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ ప్లాన్ కూడా బట్టబయలైంది. బీఆర్ఎస్ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం పూర్తయినా కూడా, ఈ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు టార్గెట్ పెట్టడం మూసీలో మీ మూటల వేటకేనని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు.
కనికరం లేని ముఖ్యమంత్రి ఆదేశాలతో.. కాంగ్రెస్ సర్కారు కూల్చివేతలకు కేరాఫ్ గా మారితే.. ఉద్యమానికి కేంద్రబిందువుగా ఉన్న తెలంగాణ భవన్.. జనతా గ్యారేజీగా మారింది. కాంగ్రెస్ నిరంకుశ పాలనలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. కన్నీళ్లొచ్చినా బాధితులు తలుపుతట్టే ఏకైక గడపగా తెలంగాణ భవన్ నిలిచింది. కాంగ్రెస్ చేతిలో దగాపడ్డ ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకుని హైడ్రా, మూసీ బాధితుల వరకూ అందరినీ కడుపులో పెట్టుకుని కాపాడే రక్షణ కవచం.. తెలంగాణ భవన్ అనే విషయాన్ని మీరు కూడా గుర్తుపెట్టుకుంటే మంచిది.
ఓవైపు కూల్చివేతలే కాదు.. బూటకపు ఎన్ కౌంటర్ల పేరిట కాల్చిచంపుతున్న కాంగ్రెస్ సంస్కృతిని మరోసారి తెలంగాణలో అమలుచేయడం దిగ్భ్రాంతికరం. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్టుగా సాగుతున్న మీ పాలనా తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోంది. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షోభమేనని ఈ ఏడాది పాలన రుజువుచేసింది.
ఓవైపు అల్లుడి ఫార్మా కంపెనీ కోసం, మరోవైపు అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం సొంత నియోజకవర్గం కొడంగల్ లో సీఎం బలవంతంగా భూములు లాక్కునే కుట్రను దళిత, గిరిజన ఆడబిడ్డలు ఢిల్లీ వేదికగా ఎండగట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు. ఫార్మా విలేజీ ప్లాన్ బెడిసికొట్టిందనే కక్షతో

> **ఉద్యమంలో కోట్లాది మందిలో స్ఫూర్తినింపిన తెలంగాణ తల్లి దివ్య, భవ్య స్వరూపాన్ని అవమానించి, ప్రజలపై కాంగ్రెస్ తల్లిని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని రేవంత్ రెడ్డి చేస్తున్నాడు. ఒకప్పుడు బలిదేవత అని సోనియాగాంధీని తిట్టిపోసి, ఇప్పుడు చిల్లర పన్నాగాలకు తెరలేపాడు. తలరాతలు మారుస్తానని గద్దెనెక్కి తెలంగాణ తల్లిని, తెలంగాణ అస్థిత్వ ఆనవాళ్లను మార్చే కుటిల యత్నాలకు పాల్పడుతున్నాడు. ఈ నీచమైన, భావదారిద్ర్య చర్యలు భవిష్యత్తులో మీ పార్టీ మెడకే చుట్టుకోవడం ఖాయమని స్పష్టమైన హెచ్చరిక చేస్తున్నాను. గత పదేళ్లు మేము తెలంగాణ పునర్నిర్మాణంపై దృష్టిపెట్టాం తప్ప.. పనికి మాలిన ఆలోచనలు చేయలేదు. రాజీవ్ ఆరోగ్యశ్రీని, రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పేర్లు మార్చలేదు, ఇందిరాగాంధీ విగ్రహాల జోలికి వెళ్లలేదు. కానీ మనసులో విషం తప్ప మెదడులో విషయం లేని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వ ఆనవాళ్లను చెరిపేసే దారుణ కుట్రకు తెరలేపాడు.**

ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట మీ ప్రభుత్వం మరో కుతంత్రాన్ని తెరపైకి తెచ్చి పచ్చని భూముల్లో చిచ్చుపెట్టే పన్నాగాలను ప్రజలు మరోసారి తిప్పికొట్టడం ఖాయం.
అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజాధనాన్ని లూటీచేసిన సర్కారుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ చీకటి చరిత్రను లిఖించింది. సీఎం బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్ నుంచి మొదలుకుంటే.. 1100 కోట్ల పౌరసరఫరాల స్కామ్, మంత్రి పొంగులేటి కుమారిడికి అప్పజెప్పిన కొడంగల్ లిఫ్ట్ పనుల దాకా.. అడుగడుగునా వేల కోట్ల అవినీతే తాండవిచ్చింది. ఇక మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ఏకంగా లక్షన్నర కోట్లకు ముఖ్యమంత్రి రేవంత్ వేసిన స్కెచ్ ను చూసి యావత్ సమాజం నివ్వెరపోయింది. గోదావరి జలాలను మూసీకి తరలించే అంచనాలను 1100 కోట్ల నుంచి 5500 కోట్లకు అమాంతం పెంచేయడం మీ దోపిడీకి పరాకాష్ట. ఈ స్కాములే తాచుపాములై మీ కాంగ్రెస్ ను వెంటాడటం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నాను.

## తెలంగాణలో ఐదేళ్లలో
# 1,03496 మంది అదృశ్యం

మొదటి పేజీ తరువాయి




ఐదేళ్లలో అదృశ్యమైన 1,03,496 మందిలో మహిళలే 54,744 మంది ఉన్నారు. పురుషులు 34,643 మంది, బాలురు 5,750 మంది కాగా బాలికలు 8,359 మంది. ఇదే సమయంలో ఆచూకీ లభ్యమైన వారి జాబితాలోనూ 52,312 మంది మహిళలు ఉండగా, 31,291 మంది పురుషులు, 5,450 మంది బాలురు, 7,070 మంది బాలికలు ఉన్నారు. ఆచూకీ దొరకని 6,468 మందిలో పురుషులు 3,352 మంది, మహిళలు 2,432 మంది, బాలురు 295 మంది, బాలికలు 389 మంది ఉన్నారు.

**పరిష్కారం చూపాలి**

రాష్ట్రంలో ప్రతీరోజు ఎంతోమంది తప్పిపోతున్నారు. కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరికొంతమంది ఆచూకీ మా త్రం దొరకడం లేదు. బాలికలు, బాలురు, మహిళలు, పురుషుల ఆచూకీ దొరక్క.. వారి కుటుంబాల బాధ వర్ణనాతీతం. ఇప్పటికీ ఆచూకీ తెలియని వారు చాలామంది ఉన్నారు. వారు బతికి ఉన్నారో, లేదో తెలియక క్షణక్షణం బాధ అనుభవిస్తూ ఉంటారు. వారి బాధకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉంది. ఇప్పటికైనా వారి ఎదురుచూపులకు పరిష్కారం చూపాలి.



# 2035 కల్లా భారత్ సొంత అంతరిక్ష కేంద్రం

మొదటి పేజీ తరువాయి

అని ఆయన తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్ష యాత్ర 'గగన్యాన్ మిషన్'కు సంబంధించిన విషయాలను సైతం వెల్లడించారు. 2024 చివరికి లేదా 2026 ప్రారంభంలో, మొదటి భారతీయవ్యోమగామి గగన్యాన్ మిషన్ కింద అం తరిక్షంలోకి వెళతారని ఆయన వెల్లడించారు. భారత్ చేపడుతున్న తొలి మానవ సహిత దీప్ ఓషన్ మిషన్ సముద్రయాన్లో భాగంగా మత్స6000 జలాంత ర్గామిని రూపొందిస్తున్నామన్నారు. జలాంతర్గామిలో ముగ్గురు కూర్చొని 6 కిలోమీటర్ల సముద్రపు గరిష్ట లోతుకు (6,000 మీటర్లు) చేరుకోవచ్చని.. దాంతో సముద్ర వనరులు, జీవ వైవిధ్యాన్ని అధ్యయనం చేయొచ్చని తెలిపారు. సముద్రగర్భ అన్వేషణలో తోడ్పడే మానవ సహిత జలాంతర్గామి ఇదేనని చెప్పారు. ఈ నౌకను చెన్నైలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) అభివృద్ధి చేసిందన్నారు. ఇది ప్రారంభమైతే భారతదేశ మొట్టమొదటి మానవ సహిత సముద్ర అన్వేషణ మిషన్గా గా దీనికి గుర్తింపు దక్కనుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఉపగ్రహ ప్రయోగాల్లో భారత్ గణనీయమైన పురోగతిని సాధించిందని జితేంద్ర సిం గ్ తెలిపారు. ఇప్పటివరకు భారతదేశం శ్రీహరికోట నుంచి 432 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిందని, వాటిలో 397 (దాదాపు 90 శాతం) ఉపగ్రహాలను గత దశాబ్దంలోనే ప్రయోగించామని పేర్కొన్నారు. పారిశ్రామిక విప్లవాన్ని నడిపించడంలో బయోకా నమీ ప్రాధాన్యాన్ని వివరించారు

## అసెంబ్లీ ఎన్నికల్లో
# కాంగ్రెస్‌తో పొత్తు లేదు

- **ట్విటర్ (ఎక్స్) ద్వారా తెలిపిన అరవింద్ కేజీవాల్**
- **ఇండియా కూటమిలో ఉన్నా పొత్తు ఉండదు**
- **విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి బీజేపీ మాట్లాడాలి**

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**




వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు ఆప్, కాంగ్రెస్ సహా ఇతర పార్టీల మధ్య పొత్తు చర్చలు చివరిదశకు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా దీనిపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ సొంత బలంతోనే ముందుకువెళ్లనుంది. కాంగ్రెస్తో పొత్తు పెట్టుకునే అవకాశం లేదు' అని ఎక్స్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. అప్కాంగ్రెస్ మధ్య పొత్తు దిశగా అడుగులు పడుతున్నాయని, కాంగ్రె స్ కు 15 స్థానాలు కేటాయించేలా చర్చలు జరుగుతున్నాయని వార్తలు వచ్చాయి. 12 స్థానాలు ఇండియా కూటమిలోని ఇతర పార్టీలకు కేటా యించనున్నట్లు పేర్కొనగా, వాటిని తాజాగా కేజీవాల్ తోసిపుచ్చారు. ఇక ఈ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తన అభ్యర్థులతో కూడిన రెండు జాబితాలను ఆప్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. రెండు విడతల్లో 31 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చే వరకూ సీఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీని ముందుకునడిపిస్తున్నారు.ఆప్ నేత ఆతిశీ ఢిల్లీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఇక ఈ ఎన్నికల వేళ 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. తనను తాను సామాన్యుడిగా చెప్పే మాజీ సీఎం అరవింద్ కేజీవాల్.. అధికారంలో ఉన్న సమయంలో రూ. కోట్లు ఖర్చు పెట్టి ముఖ్యమంత్రి నివాసానికి మార్పులు చేశారని బీజేపీ కొంత కాలంగా ఆరోపిస్తో న్న సంగతి తెలిసిందే. దీన్ని ఆప్ తీవ్రంగా ఖండించింది. "విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి ప్రజలు అడుగుతుంటే.. వారు మాత్రం బంగ్లాల గురించి మాట్లాడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేసింది.

## రేవంత్ రెడ్డి ఏ రోజు
# జై తెలంగాణ అనలేదు...

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ ప్రకటన వచ్చిందంటే దానికి కారణం కేసీఆర్. ఈ సత్యాన్ని ఏమార్చాలని కాంగ్రెస్ చూస్తోంది. నెహ్రూ, గాంధీ పోరాటం వల్ల కాదు బ్రిటిష్ వాళ్లే దయతలిచి స్వాతంత్ర్యం ఇచ్చారు అన్నట్టు రేవంత్ రెడ్డి మాటలు ఉన్నాయి. తెలంగాణ గురించి సీఎం రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. లేకుంటే నీ రెండు కళ్ళ సిద్ధాంతం గుర్తుకు వస్తుంది. సోనియాగాంధీని బలి దేవత అన్న రేవంత్ రెడ్డినే ఇప్పుడు అదే నోటితో దేవత అంటున్నారు.
తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి మేమే తెలంగాణ తెచ్చామని చెబితే అయిపోతోందా.. ఎక్కడ అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టలేదు అని సీఎం రేవంత్ చెప్పారు. సంగారెడ్డి కలెక్టరేట్ లో జూన్ 2 2015లో అధికారికంగా పెట్టాము. గ్రామాల్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను రేవంత్ రెడ్డి ఇప్పుడు తొలగిస్తారా..? జూన్ 22 2023నాడు సెక్రటేరియట్ వద్ద కేసీఆర్ తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహాన్ని ఎవరైనా మార్చారా. నువ్వు మార్చాల్సింది ప్రజల బతుకు విగ్రహాల మార్పు కాదు. తెలంగాణా ఉద్యమం చరిత్ర రాస్తే రేవంత్ రెడ్డిది అందులో ద్రోహ చరిత్రే ఉంటుంది' అని హరీష్‌రావు అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్- టీఎంసీ.. భిన్నస్వరాలు!





**తెలంగాణ ముచ్చట్లు, ఢిల్లీ:**

విపక్ష 'ఇండియా కూటమి'లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి అదానీ అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీని వల్ల వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ విషయంపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగాలని, ఇదే విపక్షాల లక్ష్యమని పేర్కొన్నారు. డిసెంబరు 13న కచ్చితంగా పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ జరగాలని అన్నారు. కాగా, సభా కార్యకలాపాలు ఎలా సాగాలో భాజపా, కాంగ్రెస్‌లే నిర్ణయిస్తున్నాయని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ సభలోని ప్రతి విషయంలో భాజపా, కాంగ్రెస్ మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నాయని.. ఈ వైఖరిపై ఇతర పార్టీ నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని వాపోయారు. మరోవైపు, రాహుల్ నేడు పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభలో తనపై భాజపా నేతలు చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ ఎంపీ మీడియాకు చెప్పారు.

లోక్‌సభలో అదానీ అంశంపై తక్షణమే చర్చ జరపాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ విషయంపై పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అయితే, ఇందులో టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ నేతలు పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. ఈ రెండు పార్టీల ఎంపీలు సభా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన విపక్ష కూటమి భేటీకి కూడా టీఎంసీ దూరంగా ఉంది. పార్లమెంట్ సజావుగా సాగాలని తాము కోరుకుంటున్నామని తృణమూల్ నేతలు చెబుతున్నారు.

ప్రతిపక్ష కూటమికి సారథ్యం వహించే బాధ్యతను మమతా బెనర్జీకి అప్పగించాలని కాంగ్రెస్‌పై మిత్రపక్షాలు ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానన్న దీదీ.. దాన్ని సరిగ్గా నడపాల్సిన బాధ్యత సారథి స్థానంలో ఉన్న వారిపై ఉంటుందన్నారు. దీదీకి ఈ బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. సమాజ్‌వాదీ, శివసేన (ఉద్ధవ్) నేతలు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. దీంతో కూటమిలో గందరగోళ వాతావరణం నెలకొంది.

# ఇకనైనా ఆ పని మానుకోండి.. మోదీ ప్రభుత్వంపై రాహుల్ ఫైర్



**తెలంగాణ ముచ్చట్లు, ఢిల్లీ:**

ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే అదానీ వ్యవహారంపై మాట్లాడాలని విపక్షాలు గత కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా విపక్ష నేత రాహుల్ గాంధీ.. మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ స్నేహితుల కోసం కేంద్రం.. ప్రభుత్వ రంగ బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా వినియోగించడం ఇకనైనా ఆపాలన్నారు. ఆల్ఇండియా బ్యాంకింగ్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్‌కు చెందిన ప్రతినిధులతో రాహుల్ గాంధీ బుధవారం భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా పలు అంశాలను రాసుకొచ్చారు. ''ప్రజాప్రయోజనాల కంటే లాభాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనివల్ల వాళ్లు ప్రజలకు సమర్థవంతంగా సేవలు చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత ఉండటం, క్లిష్టమైన పని వాతావరణం ఉన్నప్పటికీ వారు సాధ్యకాని టార్గెట్‌లు చేరుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు సమాన అవకాశాలు ఇవ్వడం లేదు. ఉద్యోగంలో పురోగతి కల్పించడం లేదు. ప్రజలందరీ కోసం ప్రభుత్వ బ్యాంకులు పనిచేయాలి. ఎంతోమందికి జీవనాడిగా ఉన్న ఈ బ్యాంకులను మోదీ ప్రభుత్వం కొన్ని ధనిక, శక్తిమంతమైన సంస్థలకు ప్రైవేట్ ఫైనాన్షియర్లుగా మార్చేశాయి. తమ మోసపూరిత స్నేహితుల కోసం అపరిమిత నిధులు ఇచ్చే వనరులుగా ప్రభుత్వ బ్యాంకులను వాడుకోవడం మోదీ సర్కార్ ఆపేయాలని'' రాసుకొచ్చారు. ఇదిలాఉండగా.. రాహుల్‌గాంధీ బుధవారం పార్లమెంటులో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ నేతలు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యల రికార్డులను తొలగించాలని కోరారు. ఇందుకు స్పీకర్ కూడా సానుకూలంగా స్పందించారు. సభా కార్యకలాపాలు కొనసాగాలనే మేము కోరుకుంటున్నామని రాహుల్ అన్నారు. అలాగే డిసెంబర్ 13న పార్లమెంటులో రాజ్యాంగంపై చర్చ జరగాలని పేర్కొన్నారు.



# మోదీతో కపూర్ ఫ్యామిలీ..

**తెలంగాణ ముచ్చట్లు, ఢిల్లీ:**

కపూర్ ఫ్యామిలీ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. రాజ్‌కపూర్ శత జయంతి సందర్భంగా మోదీతో కలిసి కుటుంబం అంతా ఫొటోలు దిగారు. అయితే ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన నటి కరీనా కపూర్.. ప్రధాని ఆటోగ్రాఫ్ తీసుకుని మురిసిపోయారు. కరీనా సైఫ్ అలీఖాన్ దంపతులతో పాటు రణ్ బీర్ కపూర్‌అలియా భట్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

**ఈ ఆనందం ఎన్నటికీ మరుచిపోలేనిది..**

ఇక ఈ విషయాన్ని అభిమానులో షేర్ చేసుకున్న కరీనా.. 'మా గ్రాండ్‌ఫాదర్ శత జయంతి సందర్భగా ప్రధాని మమ్మల్ని ఆహ్వానించారు. ఇది మేము గౌరవంగా భావిస్తున్నాం. మోదీ జీ.. మీకు కృతజ్ఞతలు. రాజ్ కపూర్ జయంతిని సెలబ్రేట్ చేసుకుంటున్న తరుణంలో మీరు మా కుటుంబానికి ఇచ్చిన మద్దతు ఎన్నటికీ మరుచిపోలేనిది' అంటూ మోదీకి కరీనా థ్యాంక్స్ చెప్పారు. ఇదిలా ఉంటే.. నటుడు, దర్శకుడు, నిర్మాతగా భారతీయ చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేసిన రాజ్‌కపూర్.. 1924 డిసెంబర్ 14లో జన్మించి 1988లో మరణించారు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగానే రాజ్‌కపూర్ జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. డిసెంబర్ 13 నుంచి 15 వరకు 'రాజ్‌కపూర్ 100: సెంటినరీ ఆఫ్ ది గ్రేటెస్ట్ షోమ్యాన్' పేరుతో వేడుకలు జరగనున్నాయి. 40 నగరాల్లోని 135 థియేటర్లలో 'ఆగ్', 'ఆవారా', 'శ్రీ420', 'సంగం', 'బాబీ' లాంటి 10 చిత్రాలను ప్రదర్శించనున్నట్లు ఆర్‌కే ఫిల్మ్స్, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్ఎఫ్‌డీసీ సంస్థలు తెలిపాయి.



# ఏటీఎం ద్వారా పీఎఫ్ విత్ డ్రా..

**తెలంగాణ ముచ్చట్లు, ఢిల్లీ:**

ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పీఎఫ్ విషయంలో ఇంక టెన్షన్ అవసరం లేదని తెలిపింది. ఈపీఎఫ్ఓ చందాదారులు నేరుగా ఏటీఎంల ద్వారా తమ పీఎఫ్‌ను విత్ డ్రా చేసుకునే అవకాశం త్వరలోనే కల్పించనున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి సుమిత దావ్రా ప్రకటించారు. ఏటీఎంల ద్వారా చందాదారులు, లబ్ధిదారులు ఈ నగదును సులభంగా పొందవచ్చన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచే ఈ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని సుమిత తెలిపారు.

**టెక్నాలజీ మెరుగు..**

కార్మికులకు మెరుగైన సేవల కోసం కార్మిక మంత్రిత్వ శాఖ తన ఐటీ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తోందని కారయదర్శి సుమిత తెలిపారు. ఈపీఎఫ్ విషయంలో టెక్నాలజీని అభివృధి చేస్తున్నామని ఎప్పారు. రెండు, మూడు నెలల్లోనే ఇదంతా సెట్ అవ్వొచ్చని...వచ్చే ఏడాది జనవరి కల్లా ఈ సైకర్యం అందబాటులోకి రావొచ్చని చెప్పారు. ఈపీఎఫ్‌వో సేవలను మరింత మెరుగుపరచడంతోపాటు జీవన సౌలభ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి పీఫ్ ఖాతా అనేది ఉంటుంది. మనకు నెల నెలా క్రెడిట్ అయ్యే శాలరీ నుంచి కొంత మొత్తం ఈ పీఎఫ్ ఖాతాలో జమ అవుతూ ఉంటుంది. అయితే వీటిని విత్ డ్రా చేసుకోవాలంటే.. వెబ్ సైట్ కు వెళ్లి చేసుకోవాలి. దీని కోసం ఈపీఎఫ్ఓ యాప్ ఉమంగ్ అందుబాటులో ఉంది. ఉమంగ్ యాప్ ద్వారా కూడా EPFO సేవలను యాక్సెస్ చేసుకోవచ్చు. దీని ద్వారా మీ పీఎఫ్ అకౌంట్లో ఎంత అమౌంట్ ఉందో తెలుసుకోవచ్చు. అంతే కాదు.. దీని నుంచి కూడా మీ పీఎప్ ఖాతాలో డబ్బులను డ్రా చేసుకోవచ్చు. దీనిని మీ మొబైల్ నుంచే డైరెక్ట్‌గా చూసుకునే వీలుంటుంది. ఇప్పటి వరకూ ఈ విధానమే అమల్లో ఉంది.

# యాదగిరిగుట్ట క్షేత్రంలో అయ్యప్ప స్వాముల గిరి ప్రదక్షిణ

**తెలంగాణ ముచ్చట్లు, యాదగిరిగుట్ట :**



తెలంగాణలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కొండచుట్టూ అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన మాలధారణ భక్తుల సామూహిక గిరి ప్రదక్షిణ పర్వం బుధవారం భారీ ఎత్తున జరిగింది. వేకువ జామున కొండకింద వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గిరి ప్రదక్షిణ చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో గిరి ప్రదక్షిణ దారి కిట కిటలాడింది. ఈ పర్వంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈఓ భాస్కర్ రావు పాల్గొన్నారు.

# కేవలం 3 రోజుల్లో రూ.5.5 లక్షల నష్టం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



క్రిప్టో కరెన్సీ మార్కట్లో బలహీనత కనిపిస్తోంది. ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణే ఇందుకు కారణం. లక్ష డాలర్ల స్థాయిని తాకాక బిట్ కాయిన్ క్రమంగా పతనమవుతోంది. 3 రోజుల్లోనే 6500 డాలర్లు అంటే సుమారు రూ. 5.5 లక్షల మేర నష్టపోయింది. ఇవాళ 96,593 డాలర్ల వద్ద మొదలైన బీటీసీ 539 డాలర్ల నష్టంతో 96,093 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.ఎంసీఏపీ 1.94 ట్రిలియన్ల డాలర్ల నుంచి 1.91 ట్రిలియన్ల డాలర్లకు తగ్గింది. ఈటీహెచ్, యూఎస్‌డీటీ,ఎక్స్ఆర్పీ, ఎస్ఓఎల్, బీఎన్‌పీ,డీఓజీఈ, యూఎస్‌డీసీ, ఏడీఏ,టీఆర్ఎక్స్ కాయిన్లూ నష్టాల్లోనే ఉన్నాయి.క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ ఏకంగా 1,00,000 డాలర్లను దాటేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడంతో కొన్నాళ్లుగా ఇది భారీగా ర్యాలీ చేస్తున్న విషయం తెలిసిందే. గత నాలుగు వారాల్లోనే దీని విలువ 45 శాతం పెరిగిందంటే దీని దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.క్రిప్టో కరెన్సీ విషయంలో నిబంధనలను సడలిస్తానని ట్రంప్ సంకేతాలు ఇచ్చిన కొన్ని గంటల్లోనే ఇది 1,00,000 డాలర్ల మార్కును దాటేసింది. ఒక దశలో అత్యధికంగా 1,00,512 ను తాకింది. మడ్‌రెక్స్ సీఈవో ఈ పరిణామాల పై స్పందిస్తూ బిట్ కాయిన్ వెనక మస్క్ కు డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ సామర్థ్యం కట్టబెట్టడం వంటి కారణాలు ఉన్నాయి.

దీంతోపాటు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజీ కమిషన్ చైర్మన్ గా పాల్ అట్కిన్ కు ట్రంప్ బాధ్యతలు అప్పగించడం వంటివి కలిసొచ్చాయి. దీంతో క్రిప్టో అనుకూల పాలసీలు వస్తాయన్న అంచనాలు బలపడ్డాయి. భవిష్యత్తులో బిట్‌కాయిన్ 1,20,000 డాలర్లకు కూడా చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు.గతంలో పాల్ అట్కిన్ గతంలో జార్ డబ్ల్యూ బుష్ హయాంలో కూడా ఎస్ఈసీ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత పదవిని వీడాక అమెరికాలో మార్కెట్ నియంత్రణ చాలా తీవ్రంగా ఉందని న్యాయపోరాటం చేశారు. తాజాగా మళ్లీ ఆయనకే ట్రంప్ ఎస్ఈసీ పగ్గాలు అప్పజెప్పడం విశేషం. అమెరికా ఎన్నికల రోజున బిట్ కాయిన్ విలువ 69,374 డాలర్లుగా ఉంది.రెండేళ్ల క్రితం 17,000 డాలర్ల దిగువకు జారిపోయిన ఈ క్రిప్టో కరెన్సీ ఇప్పుడు లక్ష డాలర్లను దాటేయడం విశేషం.

# తెలంగాణలో 10 వేల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమిస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10 వేల 113 మంది డ్రైవింగ్ లైసెన్స్ లను 6 నెలల పాటు రద్దు చేసినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. రద్దు చేసిన లైసెన్స్ లలో 7దాదాపు 70 శాతం డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన మందుబాబులదే అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం చట్ట విరుద్ధం. మొదటి దొరికితే ఫైన్ వేసి కోర్టు ముందు హాజరుపర్చుతారు పోలీసులు. అయితే మూడోసారి కూడా మద్యం సేవించి పోలీసులకు చిక్కితే కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు వారి లైసెన్స్ లను రద్దు చేస్తున్నారు అధికారులు.

**రద్దైన లైసెన్స్ లలో...70 శాతం మందు బాబులవి,**

* మిగతా 30 శాతం ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెవీ లోడ్ తో రోడ్లపై భారీ వాహనాలను నడుపుతూ పట్టుబడ్డ వాహనదారులవి ఉన్నాయి. అయితే గతంలో కంటే ఈసారి మద్యం సేవించి పోలీసులకు పట్టుబడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని.. అందులో ఎక్కువ మంది మైనర్లు, యువత ఉండడం ఆందోళన కలిగించే అంశం అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదిలా ఉంటే.. ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఒక సంవత్సరంగా పరిగణించి ఒకేసారి డ్రైవింగ్ లైసెన్స్ లను అధికారులు రద్దు చేస్తూ ఉంటారు. కానీ, జాప్యం చేస్తున్నారనే విమర్శల నేపథ్యంలో ఈసారి అధికారులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడాది వరకు ఆగకుండా మార్చి నుంచి 8 నెలల కాలానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ లను రద్దు చేస్తూ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.



# సైబర్ స్కామర్ల వలలో హైదరాబాద్ డాక్టర్.. రూ.11 కోట్లకు టోకరా..!

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ఈ మధ్య కాలంలో సైబర్ కేటుగాళ్ల ఆగడాలు పెరిగిపోయాయి. రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులు, సంపన్నులనే టార్గెట్ చేస్తున్నారు. బెదిరించి భయపెట్టి డబ్బులు గుంజేస్తున్నారు. అప్పటికీ వినకపోతే డిజిటల్ అరెస్ట్ అంటూ వణికిస్తున్నారు. కేసు ఫైల్ చేసి జైల్లో వేస్తామంటూ బెదిరిస్తున్నారు. అలా డబ్బులు కొట్టేయడమే కాకుండా.. వీడియో కాల్ ద్వారా బట్టలు విప్పమని మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు కొందరు స్కామర్లు.

డాక్టర్‌కి రూ.11.11 కోట్లు టోకరా

తాజాగా అలాంటి సైబర్ స్కామ్ మరొకటి హైదరాబాద్‌లో జరిగింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీకి చెందిన 50 ఏళ్ల డాక్టర్ నుంచి రూ.11.11 కోట్లు కాజేశారు. ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఈ డబ్బును 34 విడతలుగా దోచేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

ఆగస్టులో మిత్తల్ అనే వ్యక్తి బాధితుడి (డాక్టర్) వాట్సప్‌కు ఫారెక్స్ ట్రేడింగ్ అనే ఒక లింక్ పంపించాడు. ఇందులో ఇన్వెస్ట్ చేస్తే భారీగా లాభాలు పొందొచ్చని నమ్మించాడు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు సంపాదించొచ్చని మాయ చేశాడు. ఇక ఇదంతా నిజమేనని నమ్మిన ఆ వైద్యుడు.. కేటుగాళ్లు పంపించిన లింక్ ఓపెన్ చేసి అందులో తన పేరుతో పాటు ఇతర వివరాలను నమోదు చేసుకున్నాడు.

అయితే ఆ కేటుగాడు అయిన మిత్తల్ మొదటి నుంచి తన ప్లాన్ ప్రకారమే మాయ చేస్తూ వచ్చాడు. మొదటగా ఫారెక్స్ ట్రేడింగ్ కోసం భారతీయ కరెన్సీని యూఎస్‌డీటీ అనే క్రిప్టో కరెన్సీలోకి మార్చాల్సి ఉంటుందని డాక్టర్‌కి చెప్పాడు. అనంతరం కేటుగాడు తనతో పాటు తన కుమార్తె సాక్షిగా చెప్పి ఓ యువతి అకౌంట్‌కు డబ్బులు పంపించాలని చెప్పాడు. దీంతో ఆ బాధితుడు ఆర్‌టీజీఎస్ ద్వారా ఆ అకౌంట్‌కు డబ్బులు పంపించాడు.

డబ్బులు పంపించిన అనంతరం ఆన్‌లైన్‌లో 'ట్రేడింగ్ ఖాతా'లో పెట్టుబడి పెట్టిన దానికి అధిక లాభాలు కనిపించాయి. పెట్టిన పెట్టుబడికి ఊహించలేనంత డబ్బు లాభం రూపంలో వచ్చినట్లు ట్రేడింగ్ ఖాతా ఆన్‌లైన్లో కనిపించింది. దాన్ని విత్ డ్రా చేసేందుకు ఆ డాక్టర్ ప్రయత్నించగా.. రూ.3.7 కోట్ల టాక్స్ చెల్లించాలని మోసగాళ్లు చెప్పారు.

అయితే తన వద్ద అంత లేదని కేవలం రూ.2 కోట్లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో.. మిగతా రూ.1.7 కోట్లు రుణంగా ఇస్తామని కేటుగాడు మిత్తల్ చెప్పాడు. దీంతో అతడి వద్ద ఉన్న రూ.2 కోట్లను ఆ వైద్యుడు కేటుగాళ్లు సూచించిన అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆపై మరోసారి తనకు వచ్చిన లాభాలను విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో యూఎస్ ఫెడరల్ గవర్నమెంట్ చట్టాల ప్రకారం.. ముందస్తు పన్ను చెల్లించాలని వారు సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధిత వైద్యుడు వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు కంప్లైంట్ చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# సిటీ డిపోలన్నీ ప్రైవేటుకే..

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆర్టీసీ డీజిల్ బస్సులను నగరం వెలుపలికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించటం ఆ సంస్థ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. డీజిల్ బస్సుల స్థానంలో ప్రైవేటు సంస్థలకు చెందిన ఎలక్ట్రిక్ బస్సులను తిప్పాలని భావిస్తున్నారు. ఈ బస్సుల్లో కండక్టర్ తప్ప ఇతర సిబ్బంది అంతా సదరు సంస్థవారే ఉంటారు. దీంతో ఇప్పుడు నగరంలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది డీజిల్ బస్సులతోపాటే నగరం బయటకు వెళ్లిపోవాల్సి ఉంటుందని భావిస్తున్నారు.

**సిటీ బయటకు 80 శాతం సిబ్బంది!**

ప్రస్తుతం నగరంలో 2,500 సిటీ బస్సులు తిరుగుతున్నా యి. విమానాశ్రయం సర్వీసులు, సిటీ సర్వీసులుగా తిరుగుతున్న కొన్ని నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు మినహా అన్నీ డీజిల్ బస్సులే. ఇటీవలే ఎలక్ట్రిక్ పాలసీలో మార్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. నగరంలో డీజిల్ బస్సులను తిప్పొద్దని నిర్ణయించింది. వీటిని ఔటర్ రింగురోడ్డు అవతలికి తరలించి, నగరంలో ఎలక్ట్రిక్ బస్సులనే తిప్పాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభిస్తున్న పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఆర్టీసీ దరఖాస్తు చేసింది. ఆ పథకం కింద దేశవ్యాప్తంగా 9 నగరాలకు 14 వేల ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయనున్నట్టు కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. అందులో 2,800 బస్సులు తమకు అందజేయాలని టీజీఆర్టీసీ కోరింది. ఈ పథకానికి సంబంధించి ఈ నెలలో లేదా వచ్చే నెలలో కేంద్రం టెండర్లు పిలవనుంది. టెండర్లు దక్కించుకునే సంస్థలు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో అద్దెకు తిప్పుతాయి. ఈ బస్సుల నిర్వహణ బాధ్యత ఆయా సంస్థలదే. ఒక్క కండక్టర్ సర్వీసును మాత్రమే ఆర్టీసీ పర్యవేక్షిస్తుంది. డ్రైవర్, మెకానిక్, సెక్యూరిటీ వంటి బాధ్యతలను బస్సుల యజమానులే చూసుకొంటారు. దీంతో నగరంలోని ప్రస్తుత ఆర్టీసీ డిపోలన్నీ ప్రైవేటు బస్సులు నిలిపేందుకు కేటాయిస్తారు. రెండేళ్లలో దశలవారీగా ఈ ప్రక్రియ పూర్తిచేస్తారు. డిపోలపై అజమాయిషీ మాత్రం ఆర్టీసీదే ఉండనుంది.

అంటే, డిపో మేనేజర్, సహాయ మేనేజర్, కండక్టర్లకు టికెట్ యంత్రాలు అందివ్వటం, టికెట్ల ద్వారా వచ్చే నగదును లెక్కించి బ్యాంకుల్లో జమ చేయటం వంటి బాధ్యతలు చూసే కొద్దిమంది సిబ్బంది మాత్రమే ఆర్టీసీలో ఉంటారు. డ్రైవర్లు, మెకానిక్-శ్రామిక్‌లు, సెక్యూరిటీ సిబ్బందిని రాష్ట్రంలోని ఇతర డిపోలకు పంపాల్సి ఉంటుంది. దీంతో నగరంలోని 80 శాతం మంది ఆర్టీసీ సిబ్బంది ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఉద్యోగాల భర్తీ కూడా ఉండదని చెబుతున్నారు.

**ఇది ప్రైవేటీకరణే:కార్మిక సంఘాలు**

ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి వాటి సిబ్బంది ఆధ్వర్యంలో బస్సులను తిప్పటమంటే అంతమేర ఆర్టీసీని ప్రైవేటీకరించినట్టేనని ఆర్టీసీలోని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీన్ని సహించేది లేదని, ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నాయి. మరో వైపు జీసీసీ పద్ధతిలో బస్సుల నిర్వహణ చేపట్టినంత మాత్రాన దాన్ని ప్రైవేటీకరించినట్టు అనటం సరికాద ని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. డిపోల్లోని స్థలాలను మాత్రమే ఆయా సంస్థలు బస్సులు నిలుపుకోవటం, చార్జింగ్ చేయటం, నిర్వహణ పనులకు వినియోగించుకుంటాయని చెబుతున్నారు. డిపోల అజమాయిషీ పూర్తిగా ఆర్టీసీ ఆధీనంలోనే ఉంటుందని అంటున్నారు.

# బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపండి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహారాన్ని, బాలామృతాన్ని సక్రమంగా అందించాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. చిల్డ్రన్ హోమ్ నిర్వహణను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, పిల్లలకు పోషక ఆహారం అందించాలని సూచించారు. వృద్ధాశ్రమ నిర్వహణకు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. మహిళా సాధికారిత కేంద్రం లోకల్, ఇంటర్నల్ కమిటీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతోపాటు, ఆర్థిక, అక్షరాస్యత గురించి తెలియజేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రోజు హాజరు రిజిస్టర్‌లో రాయాలని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో నర్సింహారావు, డీసీపీవో సుబ్బలక్ష్మి, శ్రీజ, వాణి శ్రీ, వెంకటలక్ష్మి, పారిజాత పాల్గొన్నారు.



# తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

**ఖాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు**

కాజిపేట్ బాపూజీ నగర్ పోచమ్మ గుడి ఆవరణలో బుధవారం జరిగిన తేజోమయి మాల కుల సంక్షేమ సంఘ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఆ సంఘ అధ్యక్షునిగా మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బండి విజయకుమార్, కోశాధికారిగా పప్పుల గోవర్ధన్ లతో పాటు పాత ప్యానల్ సభ్యు లే ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు మర్యాల కృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ,సంక్షేమ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరికి చేరేలా చూస్తామని, మాలకులస్తులు అందరికీ ఒక తాటిపైకి తెస్తామని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ నిలుపుదల అయ్యేవరకు అలుపెరుగని పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ కొమ్మాలు, తండమల్ల వేణు, సిరిల్ లారెన్స్, మైలారం శంకర్, కాలేశ్వరం వెంకటేష్, బండి రామచందర్, పరిదల శేఖర్, కాలమాల మహేందర్, పార్లపల్లి రాజేష్, బాదం కుమార్ స్వామి, పట్నం మనోహర్ రావు, ఒగ్గుల భద్రయ్య, దార్ల రాజకుమార్, పర్ష వెంకట్ రాజు లతోపాటు తదితరులు పాల్గొన్నారు`



# మహిళలకు అదనపు ఆదాయ వనరుగా పెరటి కోళ్ల పెంపకం

- పౌల్ట్రీ లబ్ధిదారులకు కోడి పిల్లలను పంపిణీ చేసిన మంత్రి సీతక్క

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:**

వెంకటాపూర్ మండలంలోని చందన గ్రామంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మదర్ యూనిట్ నుంచి బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ లబ్ధిదారులకు కోడి పిల్లలను పంపిణీ చేశారు.

**లబ్ధిదారుల వివరాలు**

వెన్నెల మండలంలో చందన గ్రామ సమైక్య రుద్రమదేవి స్వయం సహాయక సంఘం సభ్యులకు ఈ యూనిట్ కింద ₹2,91,000 శ్రీనిధి ద్వారా రుణం అందించారు.

- లబ్ధిదారులకు 45 రోజుల పాటు కోడి పిల్లలను మదర్ యూనిట్‌లో పెంచిన తర్వాత బ్యాక్ యార్డ్ పౌల్ట్రీగా 50 నుంచి 100 కోడి పిల్లలను బ్యాంకు లింకేజీ ద్వారా పంపిణీ చేయడం జరిగింది.

**ఆరోగ్యవంతమైన జీవనానికి పౌల్ట్రీ పథకం**

"బాయిలర్ కోళ్లు తినడం వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే ప్రాకృతికంగా పెరటి కోళ్లు పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతో పాటు మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడమే ఈ పథకానికి లక్ష్యం" అని మంత్రి చెప్పారు.

మేడారం జాతర వంటి ప్రముఖ వేడుకల సమయంలో పెరటి కోళ్ల వ్యాపారం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడా కుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, అదనపు డి.ఆర్.డి.ఓ బాలస్వామి, డిపిఎం లీలా కుమారి, ఏపిఎం అలవాల రవి, మండల సమైక్య అధ్యక్షురాలు అజ్మీర కవిత, ఉపాధ్యక్షురాలు రామిండ్ల జ్యోతి, కార్యదర్శి నరికే కవిత, మహిళా సంఘ సభ్యులు, పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా శక్తిని బలోపేతం చేయడం కోసం

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా శక్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం 17 రకాల పథకాలు అమలుచేస్తోందని, అందులో భాగంగా పెరటి కోళ్ల పెంపకం పథకం ప్రధానమైనదిగా నిలిచిందని వివరించారు. "పెరటి కోళ్ల పెంపకం మహిళలకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తుందని, ఆరోగ్యపరంగా కూడా ఇది ఉపయోగకరమని" ఆమె తెలిపారు.



# లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలి

- ఎస్సై బి.రామ్ చరణ్

**జఫర్గడ్,తెలంగాణ ముచ్చట్లు:**





మండల పరిధిలోని ప్రజలు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 14వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని బుధవారం స్థానిక ఎస్సై బి.రామ్ చరణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులలో పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అలాగే భువివాదాలు, ఆస్తి తగాదాలు, ట్రాఫిక్ మొదలయిన కేసులకు పరిష్కారం పొందవచ్చు అన్నారు. అదే విధంగా మరింత సమాచారం కోసం పోలీస్ స్టేషన్లో సంప్రదించాలి అని అన్నారు.

# తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఎస్సీ వర్గీకరణ సమస్యపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. సీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్యను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాల్సిన అవసరముందని సూచించారు.





### ఎస్సీ వర్గీకరణ—నిలిచిన ప్రగతి

తాతికొండ రాజయ్య మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై గతంలో తీసుకున్న చర్యలు కోర్టు వ్యవహారాల కారణంగా నిలిచిపోయాయని గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అంశంపై చర్యలు చేపట్టినా, మాల సంఘాలు కోర్టులో కేసు వేయడంతో వర్గీకరణ ఆగిపోయిందని వివరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

### కడియం శ్రీహరిపై సంచలన వ్యాఖ్యలు

మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేసిన రాజయ్య, "1994 నుంచి ఇప్పటివరకు దళితుల హక్కులను దోచుకుంటూ, మాదిగలకు అసలు న్యాయం చేయలేకపోయారు" అన్నారు.రెండోసారి "బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో కూడా మాదిగలు అణచివేతకు గురయ్యారు" అని పేర్కొన్నారు.

### ప్రభుత్వాలపై ఆగ్రహం

తాతికొండ రాజయ్య కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు న్యాయం చేయడంలో విఫలమైందని, కొత్త కమిషన్ పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. మాదిగలు ఎదుర్కొంటున్న అన్యాయానికి ప్రధాన కారణం ప్రభుత్వాల నిర్లక్ష్యం అని అభిప్రాయపడ్డారు.

### బీజేపీ తీరుపైనా విమర్శలు

నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపినప్పటికీ, బీజేపీ ఈ విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదని,తాత్సారం చేసిందని రాజయ్య ఆరోపించారు. మాల సంఘాలు కూడా రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నాయని, మాదిగలకు నష్టం కలిగే చర్యలు చేపడుతున్నాయని ఆయన అన్నారు.

### మాదిగల కోసం పోరాటం కొనసాగుతుంది

తాతికొండ రాజయ్య మాట్లాడుతూ, ఇప్పుడు "ఎస్సీ వర్గీకరణకు ఎటువంటి అడ్డంకులు లేవని, మాదిగల హక్కుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం" అని ప్రకటించారు. "వర్గీకరణ అమలే మా ప్రధాన లక్ష్యం. ఎవరూ మాదిగల హక్కులను అడ్డుకోలేరు" అని పునరుద్ఘాటించారు.

తాతికొండ రాజయ్య చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాదిగల హక్కుల కోసం సాగుతున్న ఈ ఉద్యమం మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ అంశంపై ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో చూడాలి.





# మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

- వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ వద్ద నల్ల బ్యాడ్జిలు,హెల్మెట్లు ధరించి జర్నలిస్టుల భారీ నిరసన.

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

మీడియా ప్రతినిధులపై దాడి చేసి విచక్షణా రహితంగా వ్యవహరించిన నటుడు మంచు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న టీవీ9 జర్నలిస్ట్ రంజిత్, టీవీ 5 కెమెరామెన్ సూర్యం, ఈటీవీ కంట్రిబ్యూటర్ లపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ జర్నలిస్ట్ యూనియన్ల నేతలు, పలువురు జర్నలిస్టులు నల్లబ్యాడ్జిలు, హెల్మెట్లు ధరించి భారీ నిరసనకు దిగారు. కేంద్రం స్పందించి ఆయనకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నటుడు మోహన్ బాబు, ఆయన అనుచరుడి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. మోహన్ బాబును అరెస్టు చేసి చేయాలని, ఆయనపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జిలు, తలలకు హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, టీయూడబ్ల్యూజేఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుమాధవ్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు గిడుగు కృష్ణమోహన్, పొగాకుల అశోక్, కేకే, టీయూడబ్ల్యూజే143 వరంగల్ జిల్లా కన్వీనర్ కక్కెర్ల అనిల్ కుమార్ గౌడ్, జర్నలిస్టులు పబ్బు సతీష్, వేణు, తిరుపతి, వెంకటరత్నం, రవిచంద్ర, చేతి శ్రీనివాస్, గొట్టె వెంకన్న, వేణుప్రసాద్,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యాంకుమార్, బొడిగ శ్రీను, సహాయ కార్యదర్శి పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు గుండబోయిన దిలీప్, దొమ్మటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్, బూరం ప్రశాంత్, తోట తిరుమల్, అనిల్, వెంకట్, రాకేష్, పాషా,తదితరులు పాల్గొన్నారు.



# మాదిగ ఐక్య సమావేశం జయప్రదం చేయాలి

- మిద్దెపాక రవీందర్,ఎంఏఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు

**స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

జనగామ జిల్లా కేంద్రంలోని వైఎస్ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 15వ తేదీ ఆదివారం నిర్వహించనున్న మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (ఎంఏఎస్ఎస్) జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఏఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు.

**మాదిగల ఐక్యత కోసం ప్రయత్నాలు**

బుధవారం స్టేషన్ ఘనపూర్ మండలంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, రాష్ట్ర కార్యదర్శి గాదె సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదిగ సమాజం ఐక్యతలో మార్గదశకులు, సవాళ్లపై చర్చ జరిగింది. మిద్దెపాక రవీందర్ మాట్లాడుతూ, మాదిగలు రాష్ట్రంలో అతిపెద్ద సామాజిక వర్గంగా ఉన్నప్పటికీ, ఐక్యత లోపం కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విభజన, పార్టీల్లో చీలికల కారణంగా దళితుల ఆర్థిక, రాజకీయ స్థితి దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ఒకే వేదిక కోసం చర్యలు**

మాదిగ సామాజిక వర్గం ఐక్యత కోసం ప్రతి మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి, సభ్యులను ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని రవీందర్ అన్నారు. ఇప్పటికే ఎక్కడ సమావేశం నిర్వహించారో అక్కడ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జనగామ జిల్లా సమావేశం అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ఆశించారు.

**సమాజం కోసం భాగస్వామ్యం**

సమావేశంలో పాల్గొన్న జన్ను రాములు, గాదె సుధాకర్ మాట్లాడుతూ, దళిత జాతి సమగ్ర అభివృద్ధి కోసం మాదిగలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

జనగామ సమావేశాన్ని విజయవంతం చేయడానికి మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఆరూరి కార్తీక్, గుర్రం శ్రీను, గుర్రం రాజు, మునిగ ప్రవీణ్, మరుపట్ల దావీదు, నలిమేల చరణ్, గడపకు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# సమాచార హక్కు చట్టం కమీషనర్లను నియమించాలని మంత్రి సురేఖ కు వినతి

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్ లో తెలంగాణ అటవీ, పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని, సచివాలయంలోని ఆమె కార్యాలయంలో, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్,జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో 2005 లో అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం కమీషనర్లను వెంటనే నియమించాలని కోరారు.

ఈ సందర్భంగా, కొండా సురేఖ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం, దేశంలోని ప్రతి పౌరునికీ సమాచారం పొందే హక్కు ఉందని తెలిపారు. అటువంటి కమీషనర్ల నియామకానికి తనవంతుగా ప్రయత్నిస్తానని చెప్పారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, సెక్షన్ 6(1) ప్రకారం సమాచారానికి దరఖాస్తు చేసినప్పటికీ, 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారం కొన్నింటిని కొన్ని నెలలు గడిచినా అందించలేదని పేర్కొన్నారు.రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ చేసినప్పటికీ, సమాచారాన్ని అందించకపోవడం, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేసినా, రాష్ట్ర కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేకపోవడం వల్ల దరఖాస్తులు పరిష్కరించలేకపోతున్నాయని అన్నారు.

ఈ సందర్భంగా, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోవాలని, ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలను పకడ్బందీగా సేకరించాలి

- రాష్ట్ర రెవెన్యూ,సమాచార,గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన 80 లక్షల మందికి సంబంధించిన వివరాలు డిసెంబర్ చివరికి సేకరించాలని రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ప్రతి 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను నియమించి, క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని సూచించారు. సేకరించిన డేటా రాబోయే నాలుగేళ్ల వరకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

**గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు కఠిన చర్యలు**

డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్ 2 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. అభ్యర్థుల కోసం ప్రత్యేక ఓఎంఆర్ షీట్లను సిద్ధం చేయగా, పరీక్షల నియమాలను జిల్లా అధికారులకు వివరించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు.

**డైట్ చార్జీల పెంపు కార్యక్రమం ప్రారంభం**

డిసెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్, పాఠశాలల్లో డైట్ చార్జీలను 40 శాతం పెంచిన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు.

### పర్యవేక్షణకు ప్రత్యేక దృష్టి

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సేకరణలో ప్రజా ప్రతినిధులు, కమిటీలు భాగస్వామ్యం కావాలని, షెడ్యూల్‌ను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు. హాస్టల్స్ బియ్యం నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

# ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి

- ట్రాన్స్ జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్ ప్రారంభం
- పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:**

ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో, వైద్య రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి వద్ద 6 ఈఎంఆర్ఐ 108 సర్వీస్ అంబులెన్స్ లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఎ పిఓ చిత్రా మిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో 9 ఈఎంఆర్ఐ 108 సర్వీసులు ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. అలాగే మంగపేట, తాడ్వాయి, ములుగు, నూగురు వెంకటాపురం మండలాలకు 4 కొత్త అంబులెన్స్ లను మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు.



**ట్రాన్స్ జెండర్ ల సంక్షేమానికి ప్రత్యేక ఆస్పత్రి**

ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్ ల కోసం ఏర్పాటుచేసిన మైత్రి ట్రాన్స్ వుమెన్ క్లినిక్ ను ప్రారంభించారు. "ట్రాన్స్ జెండర్లు అర్ధనారీశ్వరుల స్వరూపాలు" అని మంత్రి పేర్కొన్నారు. సమాజంలో వివిధ అవమానాలు ఎదుర్కొంటున్న ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె వివరించారు.

## ట్రాన్స్ జెండర్ లకు వైద్య సేవలు

ఈ క్లినిక్ ద్వారా సమాన గౌరవం, సమగ్ర వైద్యం అనే నినాదంతో ట్రాన్స్ జెండర్లకు వైద్య, ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ఉంటుందని మంత్రి అన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ క్లినిక్ ద్వారా ఆరోగ్య, ఆరోగ్యేతర సేవలు, కౌన్సిలింగ్, లింగ ఆధారిత సేవలు అందిస్తామని తెలిపారు. ఇంకా, 30 మంది ట్రాన్స్ జెండర్లకు 9 మందికి ట్రాన్స్ జెండర్ ఐడి కార్డు ఇవ్వడం, 50,000 రూపాయల సబ్సిడీతో నాన్ బ్యాంక్ లింకేజీ ద్వారా సాయం అందించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడా కుల అశోక్, డీఎం అండ్ హెచ్ ఓ గోపాలరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, ఐటీడీఏ జిల్లా వైద్య అధికారి డాక్టర్ కే. క్రాంతి కుమార్, ట్రాన్స్ జెండర్ సంఘం జిల్లా నాయకురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.





# పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టం చేసేందుకు శాశ్వత అంగన్వాడీ భవనాల నిర్మాణం

- పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:**

వెంకటాపూర్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో నూతన అంగన్వాడీ భవనానికి బుధవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంఖుస్థాపన చేశారు.

**అంగన్వాడీ భవనాల ప్రాధాన్యత**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ క్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టామని, నారాయణపూర్ గ్రామంలో నిర్మాణం ప్రారంభించడం గర్వకారణమన్నారు.

"పిల్లల మానసిక వికాసం పూర్వ ప్రాథమిక విద్యతోనే మొదలవుతుంది. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందించడమే అంగన్వాడీ కేంద్రాల లక్ష్యం" అని ఆమె పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతో భవిష్యత్ తెలంగాణను నైపుణ్య వనరుల రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు.

## సమయానికి పనుల పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు మాట్లాడుతూ, నిర్మాణ పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ టీచర్లు (సీవియర్ ఆక్యుట్ మల్న్యూట్రిషన్), (మోడరేట్ ఆక్యుట్ మల్న్యూట్రిషన్) సమస్యలు లేకుండా అన్ని పిల్లల ఆరోగ్యం సాధారణ స్థాయికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా సంక్షేమ అధికారి కె. శిరీష మాట్లాడుతూ, కొత్త అంగన్వాడీ భవనాలకు మంజూరులు పొందినందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదుగా గ్రామంలో గర్భిణీ స్త్రీల సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడా కుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సీడీపీవోలు ఈపి ప్రేమలత, ధనలక్ష్మి, స్థానిక ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సాయి చరణ్ రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

ఖిల్లా ఘనపూర్ మండలం, దొంతికుంట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పత్లావత్ శ్రీను మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాయి చరణ్ రెడ్డి పాత్లవత్ శ్రీను అకాల మరణం పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం సమయంలో కాంగ్రెస్ పార్టీకి పాత్లవత్ శ్రీను అందించిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు.శ్రీను పార్టీ కోసం చేసిన కృషిని గౌరవిస్తూ, సాయి చరణ్ రెడ్డి ఆయన కుటుంబానికి 5000/ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీను చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలి
- వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్ష

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో ఇచ్చిన హామీలను దృష్టిలో ఉంచుకుని, ఆ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా, బుధవారం సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో, వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఓఆర్ఆర్, భద్రకాళి చెరువు, విమానాశ్రయం వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టు కోసం డీపీఆర్ లను త్వరగా సిద్ధం చేయాలని, అలాగే ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను సూచించారు.వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలని, ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అలాగే, ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా త్వరగా చేయాలని, భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడలు మండల స్థాయిలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభమయ్యాయి.

ప్రారంభోత్సవ ప్రసంగంలో నాయకులు, క్రీడల వల్ల శారీరక మరియు మానసిక ఉల్లాసం పెరుగుతుందని, విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించడం ద్వారా అన్ని రంగాల్లో ఎదగడానికి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కాబట్టి విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ పుష్ప అధ్యక్షతన, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ ఎస్ఎంసి చైర్పర్సన్ రవి, నరేష్, తహసిల్దార్ సరస్వతి, పెద్దమందడి ఎస్ఐ యుగంధర్ రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యం, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఫిజికల్ డైరెక్టర్స్, ఉపాధ్యాయులు, మరియు వివిధ గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.



# సినీ నటుడు మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలి

- మీడియాపై దాడికి నిరసనగా ఖమ్మంలో జర్నలిస్టుల ర్యాలీ సీపీకి ఫిర్యాదు
- సినీ నటుడు మోహన్ బాబుది ఉన్మాద చర్య
- టీయూడబ్ల్యూజే టి జె ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో సినీ నటుడు మోహన్ బాబు మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన ఘటనలో జర్నలిస్టులు తీవ్ర గాయాలు పాలయ్యారని, దీనికి కారకులైన సినీ నటుడు మోహన్ బాబు పై కఠిన చర్యలు తీసుకొని తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( టి జె ఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. మోహన్ బాబుది ఉన్మాద చర్య అని, ఇటువంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడికి నిరసనగా టియు డబ్ల్యూజే (టీఎజేఎఫ్) హెచ్ 143 రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మంలో యూనియన్ సభ్యులు కదంతొక్కారు. టి యు డబ్ల్యు జే (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ నేతృత్వంలో నల్ల జెండాల ర్యాలీ నిర్వహించారు. అహంకారపూరితంగా మోహన్ బాబు చేసిన దాడిని నిరసిస్తూ ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి అమరవీరుల స్థూపం మయూరి సెంటర్, పాత బస్టాండ్, మీదుగా జిల్లా పరిషత్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాల చేతబూనిన టీజేఎఫ్ జర్నలిస్టుల బృందం నాయకులు, జర్నలిస్టు ప్రతినిధులు మోహన్ బాబును తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అకారణంగా దాడి చేసిన మోహన్ బాబు జర్నలిస్టు సమాజానికి క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు , రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని మోహన్ బాబు, ఆయన అనుచరులు, సెక్యూరిటీ సిబ్బంది మీద కేసులు నమోదు చేసి , కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు.. డౌన్ డౌన్ మోహన్ బాబు. జర్నలిస్టు మీద దాడి సిగ్గు సిగ్గు అంటూ ఖమ్మం పట్టణంలో భారీ ర్యాలీ కొనసాగించారు. మోహన్ బాబు పై తక్షణం చర్యలు తీసుకోవాలని , లేదంటే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పోలీసులకు , రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. ర్యాలీ అనంతరం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని కలిసి టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) పక్షాన జర్నలిస్టు ప్రతినిధులు,నాయకులు ఫిర్యాదు కాపీ అందజేశారు . అకారణంగా జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేశారని. మీడియా ప్రతినిధులను గాయపరిచి అవమానపరిచి, న మోహన్ బాబు పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.జర్నలిస్టులపై దాడులు సరైనది కాదని, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఖమ్మం జిల్లా పోలీసులు చర్యలు చేపట్టాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, రాష్ట్ర నాయకులు టీన్యూస్ సాంబశివ రావు, అడపాల నాగేందర్ , ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు వెలుగు ప్రశాంత్ రెడ్డి, ఆర్టీవీ ఉదయ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్ బాబు, నగర కార్యదర్శి అమరవరపు కోటేశ్వర్ రావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యల్లమందలజగదీశ్, ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా నాయకులు చక్రవర్తి, జానీ పాషా, మదర్ సాహెబ్, ముత్యాల కోటేశ్వరరావు, బిక్కిగోపి, జీవన్ రెడ్డి, సాయి, కొరకొప్పుల రాంబాబు, పిన్ని సత్యనారాయణ, హరీష్, గణేష్, అంతోటి శ్రీనివాస్ , తిరుపతిరావు, మోహన్, రవి, శ్రీధర్, నర్సింహరావు , నల్లమోతు శ్రీనివాస్ , మురళి, పానకాల రావు, రోషి రెడ్డి , సంతోష్, మందుల వెంకటేశ్వర్లు, రామ్ చందర్ ,నాగేష్, మంద వెంకటేశ్వర్లు, రంజాన్ ,మహిళా జర్నలిస్ట్ రోజా, తదితరులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించండి

**కలెక్టర్ కు ఏఐటియుసి వినతి**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అధ్వర్యంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికుల నుంచి ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. అతి తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులు ఎవరైనా ఉంటే వారు మధ్యాహ్న భోజన కార్మికులేనని వినతి పత్రంలో పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కనీస వేతనం క్రింద రూ. 26వేలు చెల్లించడంతోపాటు పెండింగ్లో ఉన్న మెనూ ఛార్జీలను, కౌడిగుడ్ల బిల్లులు, అల్పాహార బిల్లులు, గౌరవ వేతనాన్ని విడుదల చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏడు నెలలుగా వేతనం పెండింగ్లో పెట్టారని వారు కలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేలు ఇవ్వాలని వినతి పత్రంలో కోరాడు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోదాడు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాది లక్ష్మి నారాయణ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, ఇజ్జగాని వెంకటమ్మ, ఒక్కంపూడి వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి. ఆరోమణి, సీత, పార్వతమ్మ, వెంకట్రామ్మ, కిరోమణి, భారతి, వరలక్ష్మి, రంగమ్మ, కనకమ్మ, తిరపతమ్మ తదితరులు ఉన్నారు. వినతి పత్రానికి ముందు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# చట్టాలపై అందరికీ అవగాహన




**ఆత్మకూర్ తెలంగాణ ముచ్చట్లు:**

చట్టాలపై అందరికి అవగాహన ఉండాలని హనంకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమ దేశ్ పాండే అన్నారు. మంగళవారం ఉదయం అంతర్జాతీయ మానవ హక్కుల దినం పురస్కరించుకొని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసగించారు. మానవుల అవసరానికి చదువు, ఆహారం, ఆరోగ్యం ఎంత అవసరమో భద్రత, రక్షణ కూడా అవసరం అని అన్నారు. ప్రపంచికరణ ప్రభావం కుటుంబాలు,జీవన విధానం పై ఎంతో మార్పు తెచ్చిందని,అభివృద్ధి దిశ గా విద్య, వైజ్ఞానిక రంగం లో ఎదుగుతున్నామని అన్నారు.అన్ని విషయాలలో ఈ పరిస్థితి ఉండాలని అన్నారు.సమాజం లో, కుటుంబం లో ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారానికి అందరికి న్యాయ విజ్ఞానం అవసరం అని అన్నారు. సమస్యలను ఎదుర్కొనేందుకు చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని, అప్పుడే వాటిని పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు.అత్యవసర న్యాయ సహాయం కోసం పనిచేసే వ్యవస్థ ల సహకారం పొందవచ్చాని, గ్రామాలలో చైతన్యం పొందిన నాయకులు తో ఇది సాధ్యం అని అన్నారు.పరకాల ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ ఆడవారికి,మగవారికి సమాన న్యాయం,రక్షణ,అవసరం అని,వాటిని కల్పించే సంస్థ ల గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. గ్రామాలలో మహిళలకు సహకరించడానికి కృషి చేస్తామని అన్నారు.రమాదేవి యాక్టివిస్ట్,టీ పి ఎఫ్ అధ్యక్షులు మాట్లాడుతు మానవ హక్కులు అన్ని మహిళా హక్కులే అని వాటిని ఉపయోగించుకోవడం లోనే వ్యత్యాసం ఉందని అన్నారు. సమాజం లో స్త్రీ,పురుషులు సమానత్వం కోసం ముందుగా వారి హక్కులు పొందినప్పుడే సాధ్యం అని అన్నారు.సర్వోదయ సంస్థ కార్యదర్శి డా.పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ మహిళలకు వివక్ష, హింస లేని సమాజాన్ని ఏర్పాటు కు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాదని అన్నారు.మహిళలు కుటుంబాలలో చెప్పుకోలేని పరిస్థితి లను అధిగమించడానికి గ్రామాలలో సహాయ వ్యవస్థ లను ఏర్పాటు చేయడం తో పాటు సహకరించే వ్యవస్థ లను కూడా అనుసంధానం చేస్తున్నాదని అన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలు, సంస్థల పై అవగాహనా పెంచుకొని ఆపదలో ఉన్న బాలికలకు, మహిళ లకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో అక్కంపేట మాజీ సర్పంచ్లులు విజయ,హంసల్ రెడ్డి, కుమారస్వామి, ఎంపీపీ గోపు మల్లికార్జున్, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, ఎనకతల రవీందర్, సిలివేరు బిక్షపతి, సిలివేరు సాంబయ్య, ముద్దం కృష్ణ రాజు, ఆత్మకూరు సీఐ సంతోష్, ఆత్మకూరు వివిధ గ్రామాలకు చెందిన వారు,ఇందిర, రవీందర్, శ్రీలత, నగేష్, సఖి అడ్మిన్ హైమావతి, హరిత తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమం కోసం మరింత కృషి..

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

**గండిపేట్ తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర రైతు ల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం నాడు గండిపేట్ మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలో మార్కెట్ యార్డు ఆవరణలో మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ.... రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా ఉంటూ రైతులకు మరింత అభివృద్ధిపరిచేందుకే ఈ మార్కెట్ కమిటీ ఏర్పాట్లు చేసిందన్నారు. నూతనంగా నార్సింగి మార్కెట్ కమిటీ పాలకమండలికి రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కార దిశగా పనిచేయాలని వారికి సూచించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... రైతు మార్కెట్ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మార్కెట్ కమిటీ నూతన పాలకమండలని కోరారు. రాష్ట్ర ముదిరాజ్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ... రైతు అంటేనే కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం అండగా నిలిచిన పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అధికార అభివృద్ధి కొరకు పనిచేసిన పార్టీ కార్యకర్తలకు రానున్న రోజులలో మరిన్ని కీలక పదవులను పార్టీకి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎవరు అధర్య పడవద్దు అపోహాలు నమ్మవద్దు కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నార్సింగి నూతన పాలక మండలి కమిటీతో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట చైర్మన్‌గా వేణు గౌడ్ ప్రమాణం చేయగా, తరువాత వైస్ చైర్మన్‌గా క్యాతం దశరథ్ యాదవ్, తరువాత డైరెక్టర్లు ప్రమాణం చేశారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ... మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు, అందుకు నాయకులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో... ముంగి జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ అన్నపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు ,కస్తూరి నరేందర్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ మణికొండ చైర్మన్, నవీన్ యాదవ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే జూబ్లీహిల్స్, మధుసూదన్ రెడ్డి రాష్ట్రగ్రంధాలయ చైర్మన్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .



# విద్యార్థుల ప్రాణాలు గాల్లో దీపమేనా..

- స్కూల్ వాహనాల ప్రమాదాలకు బాధ్యులెవరు, కారకులేవరు.
- మొన్న స్కూల్ బస్సు, నేడు స్కూల్ ఆటో..
- తరచూ ప్రమాదాలతో బేంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, భయాందోళనలో విద్యార్థులు..

**తెలంగాణ ముచ్చట్లు డెస్క్:**

షాద్ నగర్ పరిధిలో పదుల్లో ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో అనుమతులు లేనివి అనేకం ఉన్నాయి. పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలు పాఠశాలల్లో ధనార్జనే ధ్యేయంగా నడుపుతున్నారు. ఫీజుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ విద్యార్థుల భద్రతల్లో లేదు. మూడు రోజుల క్రిందట ఓ ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సు ప్రమాదానికి గురవగా... సుమారు పదిమంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఒక విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. నేడు మరో పాఠశాల నుండి బయలుదేరిన ప్రైవేటు ఆటో ప్రమాదానికి గురికాగా విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదాలకు బాధ్యులు ఎవరు అనేది పెద్ద సమాధానం లేని ప్రశ్న. పరిసరాల గ్రామాల నుండి తమ పిల్లలని మంచి చదువు కోసం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలకు తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలకోర్చి పంపిస్తున్నారు. పిల్లలని జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన పాఠశాలల యాజమాన్యం సరైన వాహనాలు ఏర్పాటు చేసుకోలేక పోవడంతో పాటు, సరైన వాహనాలను సమకూర్చుకోలేక, బయటి వాహనాలలో పంపిస్తున్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో, తమ పిల్లలు చదువు,, భవిష్యత్తు ఏమో కానీ, రోజు ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులకు కునుకు లేకుండా పోయింది. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పాఠశాలలపై, వాటి వాహనాలపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు



# ట్రంప్ దూకుడు
# మొదటి రోజే 25 ఉత్తర్వుల జారీకి సిద్ధం!

**తెలంగాణ ముచ్చట్లు డెస్క్:**

ఇటీవలే అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్, జనవరి 20న బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే ఈ సారి మునుపటి కన్నా దూకుడుగా వ్యవహరించాలని భావిస్తోన్న ట్రంప్, తన కార్యవర్గ సభ్యుల ఎంపికపై దృష్టి సారిస్తూ ఇప్పటికే పలువురి పేర్లను ప్రకటించారు. అలానే వచ్చే నెలలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగానే, మొదటి రోజే దాదాపు 25 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేసేందుకు సిద్ధం అవుతున్నారని తెలిసింది. ఇమిగ్రేషన్ నుంచి ఇంధనం వరకు కీలక అంశాలపై ఆదేశాలు ఇవ్వనున్నారని సమాచారం.

**అందుకే ఈ సారి ఏకంగా 25 ఆర్డర్లు**

2017లో తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్, మొదటి రోజు కొన్ని ఆదేశాలపై మాత్రమే సంకతాలు చేశారు. ఇక 2021లో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జో బైడెన్, తొలి రోజు 17 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ మునుపటిలా కాకుండా మరింత దూకుడుగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే మొదటి రోజు దాదాపు 25 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. దీనికి సంబంధించి ప్రణాళికలకు ఇప్పటికే అధికారులకు సూచనలు కూడా చేసినట్లు తెలిసింది.

**వాటిపై ట్రంప్ దృష్టి**

అమెరికామెక్సికో సరిహద్దుకు అదనపు బలగాలను తరలించడం సహా సరిహద్దు గోడను పునర్నిర్మించడం వంటి వాటిపై ట్రంప్ దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు ట్రంప్ ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేయనున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. అలానే సరిహద్దు విధానాలకు సంబంధించి బైడెన్ తీసుకున్న నిర్ణయాలను ట్రంప్ వెనక్కి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం అందింది.

**వాటిని తప్పుబట్టిన జో బైడెన్**

మరోవైపు విదేశీ దిగుమతులపై సుంకాలు విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ చెప్పడాన్ని జో బైడెన్ తప్పుబట్టారు. అలానే విద్యా విధానం, ఆర్థిక వ్యవస్థ, పౌరహక్కులు, వలసలకు సంబంధించిన అంశాలపై ట్రంప్ మద్దతుదారులు ముందుకు తెస్తున్న ప్రాజెక్ట్2025ను కూడా విమర్శించారు.



# వినతిపత్రాన్ని అందజేసిన మాల మహానాడు నాయకులు

**దేవరకొండ, తెలంగాణ ముచ్చట్లు**

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పైన రాష్ట్ర ప్రభుత్వ వేసిన ఏకసభ్య కమిషన్ కు బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ భవనంలో వినతిపత్రాన్ని దేవరకొండ నియోజకవర్గ మాల మహానాడు నాయకులు అందించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధం కావున తీర్పును వ్యతిరేకిస్తునామని, రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాలు కల్పించిన 15% రిజర్వేషన్ పూర్తిగా అంటరానితనం వివక్షతకు దేశ వ్యాప్తంగా ఉన్న 1267 కులాలను ఒకే జాబితాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించారాని, బాబాసాహెబ్ అంబేద్కర్ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాల గడిచిన ఎస్సీలకు కల్పించిన పదిహేను శాతం రిజర్వేషన్లు పూర్తిగా అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, గతంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన అది చెల్లదని సుప్రీంకోర్టు 2004లో తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. 341 ఆర్టికల్ ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శాసనసభల్లో, పార్లమెంట్లో 2/3 వంతు మెజార్టీతో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాలని గతంలో ఐదుగురితో కూడిన ధర్మాసనం చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. 59 ఎస్సీ కులాల కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, భారతదేశంలోని పౌరులందరు సోదర భావంతో కలిసిమెలిసి ఉండే దిశలో న్యాయవ్యవస్థ పనిచేయాలన్నారు. మన్వాద ప్రభుత్వాలు సుమారు ఏడు శాతం ఉన్న ఉన్నత వర్గాల వారికి 10% రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ వాదులపై, క్రిస్టియన్స్ పై, ముస్లింలపై దాడులు చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డా" యేకుల రాజారావు, మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు యేకుల సురేష్, బోయినీ చంద్రమౌళి, నారీమల్ల మల్లేష్, గోరటి అంజయ్య, రెడ్డిమల్ల శ్రీశైలం, చేపూరి మురళి, అనిల్, అంజి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- సీఎం కప్ మండల స్థాయి టోర్నమెంట్స్ ప్రారంభం..
- క్రీడలకు బడ్జెట్ లోనూ నిధుల కేటాయింపు
- మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బిరుదు రాజమల్లు స్మారకార్థం త్వరలో సుల్తానాబాద్ లో తెలంగాణ స్థాయి ఆటల పోటీలు
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**సుల్తానాబాద్,తెలంగాణ ముచ్చట్లు**

సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో బుధవారం రోజున మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్స్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.గ్రామస్థాయి నుండి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్స్ ను నిర్వహిస్తుందన్నారు. స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడు అయిన సీఎం రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకించి ఒక యూనివర్సిటీని నెలకొల్పనున్నారని చెప్పారు.గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. క్రీడలకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్ లో ఎందరో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని చెప్పారు. ఇదే పరంపరను కొనసాగించాలని ఆయన స్థానిక సీనియర్ క్రీడాకారులను కోరారు. ఇందులో భాగంగా జూనియర్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బిరుదు రాజమల్లు స్మారకార్థం తెలంగాణ స్థాయి టోర్నమెంట్స్ ను నిర్వహించనున్నట్టు ఆయన క్రీడాకారుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. తాను స్వయంగా బాధ్యతతో ఈ టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, ఏఎంసి చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, డివైఎస్ఓ సురేష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం రవీందర్, ఎంపీడీవో దివ్యదర్శనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, ప్రసాద్, ఆసియా, వెంకటేష్, సత్యం, ఇక్బాల్, శివ, ప్రవీణ్, అజ్జు, సతీష్,కాంగ్రెస్ నాయకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# 'సిరియా నుంచి సేఫ్‌గా
# 75 మంది భారతీయులు

రియాలో నెలకొన్న పరిస్థితుల మధ్య అక్కడున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత విదేశాంగ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా 75 మంది భారత పౌరులను డమాస్కస్ నుంచి లెబనాన్‌కు సురక్షితంగా తీసుకొచ్చింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.మొత్తం 75 మంది భారతీయుల్లో 44 మంది జమ్మూకశ్మీర్‌కు చెందిన జైరిన్ (యాత్రికులు)లు ఉన్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. వారంతా సిరియా సరిహద్దులు దాటి క్షేమంగా లెబనాన్‌కు చేరుకున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి వారంతా వాణిజ్య విమానాల ద్వారా లెబనాన్ నుంచి త్వరలోనే స్వదేశానికి చేరుకోనున్నట్లు తెలిపింది. ఇంకా అనేక మంది భారతీయులు సిరియాలో ఉన్నారని వెల్లడించింది. వారంతా డమాస్కస్‌లోని రాయబార కార్యాలయంతో +963 993385973 వాట్సప్‌లో, hoc.damascus@mea.gov.in ఇమెయిల్ ద్వారా టచ్‌లో ఉండాలని పేర్కొంది.సాయుధ తిరుగుబాటుదారుల సిరియా రాజధాని డమాస్కస్‌తో సహా పలు నగరాలను ఆక్రమించుకున్నారు. దీంతో అసద్ తన కుటుంబంతో సహా రష్యాకు శరణార్థిగా వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన మాస్కోలో ఉన్నారు. అధికార బదిలీపై తిరుగుబాటుదారులతో చర్చలు జరిపాకే అసద్ సిరియాను వీడారని రష్యా ప్రభుత్వం తెలిపింది. ఇక, అసద్ సిరియాను వీడిన వెంటనే నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిందని రెబల్స్ సంబరాలు చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ రెబల్స్ నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



# మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేత

**చౌటుప్పల్ తెలరగాణ ముచ్చట్లు**

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొట్టే అక్రమార్కులపై తక్షణమే చర్యలు చేపట్టాలని, అలాగే కోర్టులో ఉన్నటువంటి మార్కెట్కు సంబంధించిన కేసును త్వరితగతిన తీర్పు విలువరించేలా చర్యలు చేపట్టుట గురించి చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కే నరసింహారెడ్డికి బి భాస్కర్ గౌడ్, ఎండి చాంద్ పాషా, కే శేఖర్ లు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో గల ప్రభుత్వ కూరగాయల మార్కెట్ మడిగేలలో చాలా సంవత్సరం నుండి ప్రభుత్వానికి ఎలాంటి అద్దెలు చెల్లించకుండా ఇష్టారితిన కొందరు కొందరు దాళరులు తమ సొంత ఆస్తిగా భావించి ఒక్కొక్క మడిగను సుమారు నెలకు 30,000 రూపాయల వరకు బయట వ్యక్తులకు కిరాయికి ఇచ్చి తమ జేబులు నింపుకుంటున్నారని, మున్సిపాలిటీకి నెల నెల చెల్లించవలసిన అద్దె చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం జరుగుతుందని, అంతేకాకుండా కూరగాయల మార్కెట్లో ఉన్న మడిగలను చాలా సంవత్సరాలుగా ఒకే వర్గానికి చెందిన వారు నిర్వహిస్తున్నారని కాబట్టి ఈసారి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ను కోరారు. మున్సిపల్ మడిగలలో రికార్డుల ప్రకారం ఉన్నటువంటి వారు కాకుండా కొందరు అక్రమంగా నిర్వహించుచున్న వారిపై చర్యలు తీసుకొని తక్షణమే పాత పద్ధతిని రద్దుచేసి మళ్లీ వేలంపాట నిర్వహించి రైతులకు, నిరుద్యోగ యువతకు ఇందులో అవకాశం కల్పించాలని, ఇతర వ్యక్తులకు దుకాణాలను కిరాయికి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో తెలియజేశారు.



# బాలయ్య వారసుడు మోక్షజ్ఞ ఫస్ట్– 5 ఫిక్స్?

నందమూరి నటవారసుడు మోక్షజ్ఞ మొదటి ఐదు చిత్రాలు ముందే ఫిక్సై అయిపోయాయా? తనయుడిని బాలయ్య పక్కా ప్లాన్ తోనే రంగంలోకి దించుతున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రశాంత్ వర్మతో మోక్షజ్ఞ డెబ్యూ చిత్రాన్ని పట్టాలెక్కిస్తున్నట్లు ప్రకటించారు. అయితే అనూహ్యంగా ఆప్రాజెక్ట్ డైలమాలో పడిందనే ప్రచారం సాగుతంది. తప్పకుండా ఆ సినిమా ఉంటుంది? కానీ అది డెబ్యూ అవుతుందా? రెండవ సినిమా అవుతుందా? అన్నది ఆసక్తి కరంగా మారింది. - పంజాబీ బ్యూటీ డబుల్ ధమాకా! ఎందుకంటే? మోక్షజ్ఞతో బాలయ్య అంతకు మించి ప్లాన్ చేస్తున్నాడనే కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. 'కల్కి 2898' దర్శకుడు నాగ్ అశ్విన్ తో తనయుడిని లాంచ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. ఒకవేళ నాగ్ అశ్విన్ తో మొదటి సినిమా కాకపోతే రెండవ సినిమా అయ్యే అవకాశం ఉంటుందిట. అలా ప్రశాంత్ వర్మ-నాగ్ అశ్విన్ మధ్య చిన్న గేమ్ నడుస్తోంది. ఈ రెండు సినిమాల తర్వాత మరో యువ మేకర్ వెంకీ అట్లూరితో సినిమా చేసేలా ఒప్పందం చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. వెంకీ సక్సెస్ ట్రాక్ చూసి బాలయ్య ఇలా అతడిని కూడా తెరపైకి తెస్తున్నట్లు వినిపిస్తుంది. అలాగే 'ఆదిత్య 999'కి సీక్వెల్ ఉంటుందని కూడా చాలా కాలం క్రితం ప్రకటించారు. అందులో మోక్షజ్ఞ నటిస్తాడని కూడా ప్రచారంలో ఉంది. కొడుకు ఫ్రెండుతో మలైకా డేటింగ్? ఇక బాలయ్యలో కొత్త యాంగిల్ ని తట్టి లేపిన బోయపాటి శ్రీనుతో తనయుడికి ఓ ప్రాజెక్ట్ సెట్ చేసి పెట్టారు. మోక్షజ్ఞ ఓ మూడు సినిమాల తర్వాత బోయపాటితో సినిమా చేస్తే బాగుంటుందని ఇలా అతడిని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. మొత్తంగా మోక్షజ్ఞ కోసం బాలయ్య మొదటి ఐదు సినిమాలు ముందుగానే సిద్దం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఏడాది 2025లో ఏదో ఒక సినిమాతో మోక్షజ్ఞ బొమ్మ థియేటర్లో పడటం అయితే ఖాయం.



# కీర్తి సురేష్ పెళ్లి సందడి..

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తన చిన్న నాటి స్నేహితుడు, ప్రియుడు ఆంటోనీ తటిల్ తో ఏడడుగులు వేయబోతోంది. గోవాలో వీరి వివాహం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య గ్రాండ్ గా జరగబోతోంది. ఈ వివాహ వేడుకకి వచ్చే అతిథుల కోసం ఈ జంట ప్రత్యేక ఏర్పాట్లు చాలా చేసారంట. ఎంటర్టైన్మెంట్ తో పాటు, వినోదం అందించే విధంగా వారిద్దరికి సంబంధించిన వెడ్డింగ్ గ్రీటింగ్స్, ఫజిల్స్ తో ప్రత్యేకంగా అలంకరించారంట. వీటికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీరి పెళ్లి కేరళ హిందూ సంప్రదాయంతో పాటు, క్రిస్టియన్ స్టైల్ లో రెండు సార్లు జరగబోతోంది. వివాహ వేడుక ముహూర్తంను గురువారం ఉదయం నిర్ణయించారంట. కీర్తి సురేష్, ఆంటోనీ తటిల్ కలిసి దిగిన ఫోటోలని స్పెషల్ గిఫ్ట్ కార్డ్స్ గా డిజైన్ చేశారు. కేరళ సంప్రదాయ శైలిలో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ని నిర్వహించారు.

## sports స్పోర్ట్స్



# డబ్ల్యూటీసీ ఫైనల్లో దక్షిణాఫ్రికా.

టీమ్ ఇండియాకు కంగారూ తోక అడ్డంకి దురదృష్టాఫ్రికాగా పేరున్న ఆ జట్టుకు ఈసారి అదృష్టం కలిసొచ్చింది.. సొంతంగా రాణించినదాని కంటే అవతలి జట్టు ఓటమి పాలవడం మేలు చేసింది. నిన్న మొన్నటి వరకు ఆ జట్టు పేరే వినిపించలేదు.. కానీ, ఇప్పుడు ఏకంగా ఫైనల్ కు చేరింది.. అదికూడా మిగతా జట్ల కంటే ముందే తన బెర్తును ఖాయం చేసుకుంది. ఇప్పటివరకు వన్డే ప్రపంచ కప్ ఫైనల్ చేరని ఆ జట్టు.. ఇటీవల టి20 ప్రపంచ కప్ ఫైనల్లో టీమ్ ఇండియా చేతిలో ఓడిన ఆ జట్టు ఇప్పుడు అదే టీమ్ ఇండియాను వెనక్కునెట్టి ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది ఈసారి అదృష్టం కలిసొచ్చి.. దురదృష్టాఫ్రికాగా పేరున్న ఆ జట్టుకు ఈసారి అదృష్టం కలిసొచ్చింది.. సొంతంగా రాణించినదాని కంటే అవతలి జట్టు ఓటమి పాలవడం మేలు చేసింది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ కు దూసుకెళ్లింది. ఇదెలా జరిగిందంటే.. స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ను 20తో దక్షిణాఫ్రికా నెగ్గింది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో 63.33 శాతంతో టాప్ లోకి వెళ్లింది. కేవలం మరొక్క మ్యాచ్ లో విజయం సాధించినా చాలు.. ఫైనల్ బెర్తు ఖాయం అవుతుంది. అయితే, ఈ నెలాఖరులో సొంత గడ్డపై పాకిస్థాన్ తో రెండు టెస్టులు ఆడనుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా మంచి ఫామ్ లో ఉంది. ఈ నేపథ్యం పాక్ పై నెగ్గడం పెద్ద కష్టమేం కాదు. కేవలం ఒక్క మ్యాచ్ లో గెలిచినా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తు ఖాయం. అనూహ్యంగా దక్షిణాఫ్రికా ఫైనల్ చేయడంతో భారత్ కు కొంత మేలే జరిగింది. సఫారీలు టాప్ లోకి రావడంతో ఆస్ట్రేలియా (60.71) రెండో స్థానానికి పడిపోయింది. గులాబీ టెస్టులో ఓడిన భారత్ (57.29) మూడో స్థానానికి దిగింది. మొన్నటి వరకు శ్రీలంక (45.45) పోటీలో నిలిచినా.. ఇప్పుడు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, భారత్ లకు మాత్రమే ఫైనల్ చేరే చాన్సుంది. హ్యాట్రిక్ కొట్టాలంటే.. గత రెండు సైకిల్స్ (201921), (202123) లో ఫైనల్ చేరిన భారత్ కు ఈసారి సమీకరణాలు క్లిష్టంగా మారాయి. కారణం.. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో మూడుకు మూడు టెస్టులు ఓడడమే. అయితే, ఆస్ట్రేలియాపై తొలి టెస్టు నెగ్గడంతో ఆశలు చిగురించాయి. రెండో మ్యాచ్ లో ఓడినా.. ఆస్ట్రేలియాతో మిగిలిన మూడు మ్యాచ్ లు గెలిస్తే నేరుగా ఫైనల్ కు వెళ్తుంది. కాకపోతే.. ఒక్కటి ఓడినా పరిస్థితి క్లిష్టం అవుతుంది. అప్పుడు దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ సిరీస్ ఫలితంపై ఆధారపడాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం బోర్డర్ - గావస్కర్ సిరీస్ లో భారత్ 32తో గెలిచినా 64.05 శాతంతో ఫైనల్ చేరుతుంది. 31తో నెగ్గితే పాయింట్లు 60.52 శాతం అవుతాయి. 22తో డ్రా అయితే భారత్ ఫైనల్ అవకాశాలు తగ్గుతాయి.

# టీమిండియాకు షాకింగ్ న్యూస్..

భారత్ -ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతున్న సంగతి తెలిసిందే. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో భారత జట్టు ఐదు టెస్ట్ మ్యాచులను ఆడుతోంది. పెర్త్ వేదికగా జరిగిన మొదటి టెస్ట్‌లో భారత జట్టు ఘన విజయం సాధించగా, అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. దీంతో మూడో టెస్ట్ మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొంది. మూడో టెస్ట్ గబ్బా వేదికగా జరుగనుంది. అయితే మూడో టెస్ట్‌కు ముందు టీమిండియాకు బ్యాడ్ న్యూస్ అందింది. టీమిండియా స్టార్ ఆటగాడు రిషబ్ పంత్ గాయపడ్డాడు. జట్టు ప్రాక్టిస్ చేస్తోన్న సమయంలో రిషబ్ పంత్ చేతికి గాయం అయినట్టు తెలుస్తోంది. బంతి వేగంగా తగలడంతో రిషబ్ పంత్ చేతికి గాయం అయింది.గాయంతో విలవిలాడిన పంత్ ప్రాక్టిస్ మధ్యలోనే ఆపేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. పంత్ గాయం తీవ్రతపై ఎలాంటి అప్‌డేట్ బయటకు రాలేదు. అయితే, పంత్ గాయం తీవ్రంగా తీవ్రంగా ఉంటే కనుక గబ్బా టెస్టుకు అతను దూరం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్ లో అదరగొడుతున్న తెలుగు కుర్రాడు.." ఒకవేళ ఇదే కనుక జరిగితే ఆ ప్రభావం జట్టుపై పడే అవకాశం కనిపిస్తోంది.గబ్బా గ్రౌండ్‌లో పంత్‌కు మంచి రికార్డు ఉంది. గతంలో అక్కడ సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన పంత్ జట్టుకు విజయాన్నిందించాడు. గబ్బాలో అప్పటి వరకు ఓడిపోలేదన్న ఆస్ట్రేలియా అహంకారానికి పంత్ గతంలో ముగింపు పలికాడు. అలాంటి పంత్ ఇప్పుడు గాయంతో మూడో టెస్ట్‌కు దూరం అయితే జట్టు గెలవడం కష్టమే అని అభిమానులు భావిస్తున్నారు. మరి ఇటువంటి పరిస్థుతుల్లో పంత్ ఆడుతాడో లేదో చూడాలి. డిసెంబర్ 14 నుంచి మూడో టెస్ట్ మొదలుకానుంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in